తీన్మార్
విలేకరులు కావలెను
పత్రిక రంగంలో మరో సంచలనం, వినూత్న రీతిలో వెలుబడతూ విశేష ప్రజాదరణ పొందుతున్న
తీన్మార్ తెలుగు దిన పత్రిక
తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 33 జిల్లాలలో పని చేయుటకు
జిల్లా బ్యూరో చీఫ్ లు, జిల్లా స్టాఫ్ రిపోర్టర్ లు,
జిల్లా క్రైమ్ రిపోర్టలు, నియోజకవర్గ ఇంచార్జీలు, మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను.
ఆసక్తి కలిగిన వారు సంప్రదించగలరు
అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత,
కొత్త వారికి అవకాశం ఇవ్వబడును.
ఈ క్రింది నెంబర్ల ను ఫోన్ ద్వారా లేదా వాట్సప్ ద్వారా సంప్రదించగలరు
9177108128, 9966847463

# తీన్మార్
నేటి వాస్తవాలు... తెలుగు దిన పత్రిక
teenmaardesk@gmail.com
for e-paper scan now
ములుగు | సంపుటి : 02 | సంచిక : 296 | చీఫ్ ఎడిటర్ : రెడ్డి శేఖర్ | గురువారం | 8 ఫిబ్రవరి 2024 | పేజీలు : 08 | వెల ₹5
Published from Mulugu Circulated by Warangal, Khammam, Hyderabad, Nalgonda, Mahabubnagar, Rangareddy,Medak, Karimnagar,Nizamabad, Adilabad.

## రిజిస్ట్రేషన్ లేని ప్రార్థనా స్థలాలపై హైకోర్టు కీలక ఆదేశాలు జారీ

అక్రమ నిర్మాణాలను తొలగించాలని రెవెన్యూ అధికారులకు ఆదేశాలు



2

## నేడు ఆప్షనల్ హాలిడేగా ప్రభుత్వ ఉత్తర్వులు

స్కూళ్లకు, ఉద్యోగులకు సెలవులను ప్రకటించిన ప్రభుత్వం




2

## రాష్ట్రం కోసం పోరాడే చిత్తశుద్ధి బీఆర్ఎస్‌కే ఉంది : ఎమ్మెల్యే కడియం శ్రీహరి

సీఎం తన భాష మార్చుకోవాలని వాఖ్యలు చేసిన కడియం



2

## వైద్యారోగ్య విభాగంలో డిప్యుటేషన్లు రద్దు చేస్తూ ఉత్తర్వులు

ఈ నెల 8న రిపోర్ట్ చేయలేని యెడల చర్యలు

2

# గత పాలకుల పాపాలను ఎండగట్టాల్సిందే!



### నేటినుంచి అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు

తెలంగాణ బ్యూరో, ఫిబ్రవరి 07 (తీన్మార్ న్యూస్): వేసవి ప్రారంభానికి సూచికగా శివరాత్రికి ముందే సూరీడు మెల్లగా వేడెక్కుతున్నాడు. ఎండలు బాబోయ్ అనేలా సూర్యగమనం మొదలయ్యింది. ఇక ఈయేడు కూడా ఎండలు మండించనున్నాయి. ఇదే క్రమంలో ఎన్నికల వేడి కూడా అంటుకుంటోంది. ఏప్రిల్‌లో

మిగతా 2 లో

# పేదలకందే వైద్యంపై ప్రభుత్వం దృష్టి

డిజిటల్ హెల్త్ కార్డులు ఇచ్చేందుకు ప్రభుత్వం ప్లాన్

వైద్యారోగ్య శాఖ దీనిపై కసరత్తు ప్రారంభించనట్లు సమాచారం

2 లో..





టీఎస్ఆర్టీసీలో ఆందోళన రేకెత్తిస్తోన్న

# వరుస దాడులు

మహాలక్ష్మీ స్కీం ప్రకటన అనంతరం పరిస్థితులు మరింత ఘోరం

సిబ్బందిపై దాడులకు పాల్పడితే రౌడీ షీట్‌లు కేసులు తెరుస్తాం: సజ్జనార్

ఉద్యోగులకు ధైర్యం చెప్పే పనిలో సంస్థ ఎండీ వీసీ సజ్జనార్

హైదరాబాద్, ఫిబ్రవరి 07 (తీన్మార్ న్యూస్): తెలంగాణ రోడ్డు రవాణ సంస్థ సిబ్బందిపై వరుస దాడులు జరుగుతున్నాయి. ఆ సంస్థ ఉద్యోగుల్లో ఆందోళన రేకెత్తిస్తోంది. మహాలక్ష్మీ స్కీం ప్రకటన అనంతరం పరిస్థితులు మరింత ఘోరంగా మారాయి. ఈ నేపథ్యంలో ఉద్యోగులకు ధైర్యం చెప్పే పనిలో ఉన్నారు ఆ సంస్థ ఎండీ వీసీ సజ్జనార్. మొన్నీమధ్య

మిగతా 2 లో



2లో..

## తెలంగాణలో ఆటో డ్రైవర్లు ఆందోళనలు

ప్రభుత్వ వైఖరికి నిరసనగా ఈ నెల 16న ఆటోలు బంద్

మహిళలకు ఉచిత బస్సు సౌకర్యంతో ఉపాధి కరువైందని అసోసియేషన్ నిర్ణయం

## మేడారం జాతరకు వెళ్లలేని భక్తుల మొక్కుల సమర్పనకు దేవాదాయ శాఖ కీలక నిర్ణయం

మొక్కుల చెల్లింపునకు ఆన్‌లైన్ సదుపాయం కల్పించిన దేవాదాయ శాఖ

మీ సేవ, పోస్టాఫీసులు, టీయాప్ ఫోలియో ద్వారా అవకాశం



2 లో..



## శివ బాలకృష్ణ ఇంట్లో ముగిసిన ఏసీబి అధికారుల సోదాలు

ఆదాయానికి మించిన ఆస్తులు ఉన్నట్లు అధికారుల వెల్లడి

84.60 లక్షల నగదుతో పాటు పలు స్థిర చరాస్తులు సీజ్

మిగతా 2 లో

# గత పాలకుల పాపాలను ఎండగట్టాల్సిందే !



**మొదటి పేజీ తరువాయి**

ఎండలు సుద్రుమనేనాటికి ఎన్నికల వేడి కూడా తారా స్థాయికి చేరుకునే అవకాశం ఉంది. తాజాగా తెలంగాణలో ఈ వేడి మరింత రాజుకునే అవకాశం ఉంది. ఓ వైపు పార్లమెంట్ ఎన్నికలకు ముందే తెలంగాణ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు గురువారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఓటాన్ అకౌంట్ బడ్జెట్ అయినప్పటికీ, ఇప్పటికే శ్వేతపత్రాలతో గత కెసిఆర్ ప్రభుత్వ అవినీతి, అక్రమాలను కాంగ్రెస్ ప్రభుత్వం ఎండగట్టింది. ఇప్పుడు మరోమారు కాళేశ్వరం సహా అనేక ప్రాజెక్టుల్లో అవినీతి, ధరణి వంటి సమస్యలను ప్రస్తావించడం ద్వారా బిఆర్ఎస్‌ను ఎండగట్టడానికి సిద్దం అవుతోంది. ఈ క్రమంలో కృష్ణాప్రాజెక్టులను కేంద్రానికి అప్పగించడంపై ఎదురుదాడికి బిఆర్ఎస సిద్దం అవుతోంది. దీంతో ఈ సమావేశాలు వాడీవేడీగా సాగనున్నాయి. కెసిఆర్ అసెంబ్లీకి హాజరవుతారని అంటున్నారు. విపక్షం రేవంత్‌ను రెచ్చగొట్టి ట్రాప్‌లో పడేయాలని చూస్తుంది. అలాంటి ట్రాప్‌లో పడకుండా రేవంత్ రెడ్డి హుందాగా ఉండాలి. ఎందుకంటే రెచ్చగొట్టి రెచ్చిపోయేలా మాట్లాడించేలా చేస్తారని గుర్తించాలి. అయితే ఎన్నికల సమయంలో ఎలాంటి భాష వాడినా, ఎలాంటి విమర్శలు చేసినా చెల్లుతుంది. అధికారంలోకి వచ్చినందున సిఎం రేవంత్ రెడ్డి భాష విషయంలో సంయమనం పాటించాల్సిందే. హుందాగా ఉండాల్సిందే. మాటలను కూడా పరుషంగా వాడినా..అందులో అసభ్యత లేకుండా చూసుకోవాలి. రేవంత్ రెడ్డి రెండు నెలల పాటు సంయమనంగా ఉండగలిగారు. కానీ ఇప్పుడు ఆయన కొద్దగా మాటలతో కట్టు తప్పుతున్నారు. దారుణమైన భాషతో కేసీఆర్ పై ,బీఆర్ఎస్ పై విరుచుకపడుతున్నారు. ఆ భాష గతంలో కేసీఆర్ వాడిందేనని సమర్థించుకుంటున్నారు. రాజకీయాలు హుందాగా ఉండాలి. గత ప్రభుత్వంలో జరిగిన తప్పులను ప్రజల ముందుంచాలి. తప్పు ఎవరిది ఒప్పు ఎవరిది అనేది.. నిజాలన్నీ ప్రజల ముందు పెడితే అర్థం చేసుకుంటారు. అందుకు అసెంబ్లీని వేదికగా చేసుకోవాలి. ఇంద్రవెల్లిలో నిర్వహించిన తెలంగాణ పునర్ నిర్మాణ సభలోనూ రేవంత్ రెడ్డి మాటలు తూలారు. ప్రభుత్వాన్ని పడగొడతామని మాట్లాడున్నారని వారిని పండబెట్టి తొక్కుతామని కట్టేసికొడతామని హెచ్చరికలు జారీ చేశారు. అయితే రెచ్చగొట్టేందుకు బిఆర్ఎస్ సిద్దంగా ఉంది. వారి ట్రాప్‌లో పడి రెచ్చిపోకుండా చూసుకోవాల్సిన బాధ్యత సిఎంగా రేంవత్ రెడ్డిపై ఉంది. ప్రజాస్వామ్యంలో ప్రతిపక్షం అనేది ఎప్పుడూ ప్రభుత్వాలను ఇరుకున పెట్టడానికే ప్రయత్నిస్తుంది. కెసిఆర్ అధికారంలో ఉండగా ప్రతిపక్షాలకు మాట్లాడనిచ్చే అవకాశం ఇవ్వలేదు. అసెంబ్లీలో ఏది మాట్లాడినా మైక్ ఇవ్వలేదు. ఇప్పుడు స్వేచ్ఛ ఇచ్చారు గనక బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు చాన్స్ వస్తే వదులుకోరని అందరికీ తెలుసు. తన ప్రభుత్వాన్ని కాపాడుకోవాల్సిన పని సీఎం మీదనే ఉంటుంది. కానీ మాటలు జారడం వల్ల ప్రతిపక్షానికి దొరికిపోతారు. విలువల పతనం కొనసాగుతుందన్న ఆందోళన ప్రజాస్వామ్య వాదుల్లో వినిపిస్తోంది. ముఖ్యమంత్రి స్థానానికి ఓ గౌరవం ఉంటుంది. దాన్ని కాపాడాల్సిన బాధ్యత.. ఆ సీటులో కూర్చున్న వారికే ఉంటుంది. నాడు కేసీఆర్ అలా చేశారని ఈ రోజు రేవంత్ రెడ్డి అంతకు మించి చేస్తే..రేపు వచ్చే వాళ్లు మరింత దిగజారుస్తారు. అప్పుడు పోయేది ఆయా వ్యక్తుల పరువు కాదు.. సీఎం హోదా పరువని గుర్తించుకోవాలి. ఇకపోతే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చినప్పుడు కక్ష సాధింపులకు పాల్పడతారని అందరూ అనుకున్నారు. కానీ ఆయన అలాంటి కక్ష సాధింపులకు ఇంకా పాల్పడలేదు. అలాంటివేమీ ఉండవని ఆయన చెప్పారు. రెండు నెలలపాటు అలాగే

పరిపాలనచేశారు. ఎందుకంటే కాంగ్రెస్‌లో గ్రూపు రాజకీయాలు ఎక్కువ. తెలంగాణలో కూడా అదే పరిస్థితి. కానీ రేవంత్ చాలా సున్నితంగా వ్యవహారాలను చక్కదిద్దుకుంటూ వెళ్తున్నారు. ఐఏఎస్,ఐపిఎస్, దిగువ స్థాయి పోలీసు అధికారుల పోస్టింగ్‌లు, పదోన్నతులు, భూముల వివాదాలు వంటి విషయంలో ఎక్కడా పార్టీ నేతల్ని కూడా నొప్పించకుండా.. అలాగని పైరవీలకు తలొగ్గకుండా పని చేసుకుంటూ పోతున్నారు. విధాన పరమైన నిర్ణయాల విషయాల్లో కూడా ఆయన తొందరపాటు ప్రదర్శించడం లేదు. పరిస్థితుల్ని అదుపులోకి తెచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు. ఉద్యోగులకు ఒకటో తేదీ జీతాలిస్తున్నారు. నిధుల అందుబాటును బట్టి రైతుబంధు నిధులు రైతుల ఖాతాల్లో జమ చేస్తున్నారు. నామినేటెడ్ పదవుల విషయంలోనూ లౌక్యంగా వ్యవహరిస్తున్నారు. ప్రభుత్వ నిర్ణయాలను గవర్నర్ తమిళిసై అంగీకరించేలా చేయడంలో ఆయన అంతులేని లౌక్యాన్ని ప్రదర్శించారని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. గతంలో తమిళిసై ప్రభుత్వ ప్రతిపాదనలు అనేకం పెండింగ్‌లో పెట్టారు. ఎంఎల్‌సిలుగా ప్రొ.కోదండరాం, అమీర్ అలీఖాన్ ఎంపిక సులభమయ్యేలా సఫలీకృతమయ్యారు. తర్వాత కోర్టు స్టేటస్ కో విధించింది. అది వేరే విషయం. కేంద్రంతో కూడా ఘర్షణ పూరిత వైఖరి కాకుండా సయోధ్యతో వ్యవహరిస్తూ మెహదీపట్నంలో ప్రధాన సమస్యగా ఉన్న స్కైవాక్ నిర్మాణానికి ప్రధాన ఆటంకంగా ఉన్న రక్షణ శాఖ భూములను అప్పగించేలా చేయడంలో విజయ వంతమయ్యారు. మెట్రో రెండో దశ విస్తరణ లోనూ ఆయన రియల్ ఎస్టేట్ ప్రయోజనాలకు పెద్దపీట వేయలేదు. లోక్‌సభ ఎన్నికలు జరిగే ఏప్రిల్‌లోపు, ఎన్నికల కోడ్ వచ్చేలోపు మరికొన్ని హామీలు అమలు చేయడం ద్వారా ప్రజల విశ్వాసం పెంచుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. ఈ క్రమంలో అసెంబ్లీలో గత ప్రభుత్వ తప్పిదాలను కూడా ఎండగట్టాల్సిందే. అప్పుల పైనా నిలదీయాల్సిందే. అందుకు తగు విధంగా సన్నద్దం కావాలి. విపక్షాన్ని దోషిగా నిలబెట్టాల్సిందే. తెలంగాణను అభివృద్ధి చేశామన్న ముసుగులో అప్పులు చేసిన బిఆర్ఎస్‌ను ప్రజలముందు దోషిగా నిలబెట్టే క్రమంలో కాంగ్రెస్ ముఖ్యనేతలు సమిష్టిగా పోరాడాలి.


## తెలంగాణలో ఆటో డ్రైవర్లు ఆందోళనలు

తెలంగాణ బ్యూరో, ఫిబ్రవరి 07 (తీన్మార్ న్యూస్): తెలంగాణలో ఆటో డ్రైవర్లు ఆందోళనకు దిగనున్నారు. ఈ నెల 16వ తేదీన ఆటోలు బంద్ చేయాలని నిర్ణయించారు. ప్రభుత్వ వైఖరికి నిరసనగా ఆటోలను బంద్ చేస్తున్నట్లు అసోసియేషన్ నిర్ణయించింది. తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళలకు ఉచిత బస్సు సౌకర్యాన్ని కల్పించడంతో తమకు ఉపాధి కరువైందని వారు గత కొంతకాలంగా వివిధ రూపాల్లో నిరసన తెలియజేస్తున్నారు. ఉచిత ప్రయాణంతో మంత్రులను, అధికారులను కలిసి తమ గోడును విన్నవించుకున్నారు. కానీ కాంగ్రెస్ ఇచ్చిన గ్యారంటీ కావడంతో ఆ పథకం అమలును ఆపడం మాత్రం కుదరదు. తమ కుటుంబ పోషణ కూడా కష్టమైందని, ప్రభుత్వమే ఆదుకోవాలని ఆటో డ్రైవర్లు డిమాండ్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వానికి తమ నిరసనను తెలియజేసేందుకు ఈ నెల 16న ఆటోలు బంద్ చేయాలని నిర్ణయించారు. ఆ రోజు ఒక్క ఆటో కూడా నడకూడదని సమావేశంలో డిసైడ్ అయ్యారు.

## శివ బాలకృష్ణ ఇంట్లో ముగిసిన ఏసీబి అధికారుల సోదాలు

హైదరాబాద్, ఫిబ్రవరి 07 (తీన్మార్ న్యూస్): హెచ్ఎండీఏ మాజీ ప్లానింగ్ డైరెక్టర్ శివ బాలకృష్ణ ఇంట్లో అవినీతి నిరోధక శాఖ అధికారుల సోదాలు ముగిశాయని ఏసీబీ జాయింట్ డైరెక్టర్ సుధీంద్ర వెల్లడించారు. శివబాలకృష్ణకు ఆదాయానికి మించిన ఆస్తులు ఉన్నట్లు గుర్తించినట్లు చెప్పారు. సమీప బంధువులు, ఆయన స్నేహితులు, సహ ఉద్యోగుల ఇళ్లలో మొత్తం 17 ప్రదేశాల్లో ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించారు. ఆయన ఇంట్లో రూ. 84.60 లక్షల నగదు, 2 కిలోల బంగారం, 5.5 కిలోల వెండి, 32 లక్షలు విలువ చేసే వాచ్‌లు, 3 విల్లాలు, 3 ఫ్లాట్స్, 90 ఏకరాల భూమిని గుర్తించామని తెలిపారు. భూమి ఆయన పేరుతో పాటు బినామీల పేరుపై ఉన్నట్లు గుర్తించామన్నారు. మార్కెట్ వాల్యూ ప్రకారం భూముల విలువ సుమారు రూ. 60 కోట్లు ఉంటుంది. మొత్తం ఆస్తుల మార్కెట్ విలువ రూ. 75 కోట్లు ఉంటుందన్నారు. ఈ సోదాలు ఇంకో నాలుగు చోట్ల కొనసాగుతున్నాయి. శివ బాలకృష్ణపై కేసు నమోదు చేసి, రేపు న్యాయస్థానం ముందు హాజరు పరుస్తామన్నారు. తదుపరి కస్టడీకి తీసుకుంటాం.. కొన్ని విషయాలు ఆయన చెప్పలేదు.. మా విచారణకు సహకరించ లేదు. కస్టడీకి తీసుకుంటే మరిన్ని విషయాలు తెలిసే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. శివ బాలకృష్ణ సోదరి కొడుకులు ఇద్దరు శివ బాలకృష్ణ బినామీలుగా ఉన్నట్లుగా గుర్తించారు. హైరైస్ బిల్డింగ్ జోన్ పరిధిలోకి భూముల మార్పు జరిగిందని భావిస్తున్నారు. ఉస్మాన్ సాగర్ పరిధిలో సైతం భారీగా భూ మార్పిడి జరిగిందని సమాచారం. ఆ రెండు రోజుల్లో రూ. 200 కోట్ల భూములు చేతులు మారినట్టు ఏసీబీ గుర్తించింది.

## పేదలకందే వైద్యంపై ప్రభుత్వం దృష్టి



తెలంగాణ బ్యూరో, ఫిబ్రవరి 07 (తీన్మార్ న్యూస్): ఆరు గ్యారెంటీల అమలుకు ప్రణాళికలు రూపొందిస్తూ ముందుకు సాగుతోంది. ఇప్పటికే రాష్ట్రంలో మహిళలకు మహాలక్ష్మీ పథకం ద్వారా ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని కల్పిస్తున్నది. ఆరోగ్య శ్రీ పరిమితిని రూ. 10 లక్షల వరకు పెంచింది. ఇక మరో రెండు గ్యారంటీలను అమలు చేసేందుకు రెడీ అవుతోంది. అందులో ఒకటి గృహజ్యోతి పథకం ద్వారా 200 యూనిట్ల ఉచిత విద్యుత్ ను అందించేందుకు రెడీ అవుతోంది. రూ. 500 కే గ్యాస్ ఇచ్చేందకు కూడా సిద్ధమవుతోంది. ఈ క్రమంలో రాష్ట్రంలోని ప్రజలందరికీ డిజిటల్ హెల్త్ కార్డులు ఇచ్చేందుకు ప్రభుత్వం ప్లాన్ చేస్తోంది. తెలంగాణ ప్రభుత్వం పేదలకందే వైద్యంపై దృష్టిసారించింది. ప్రతిఒక్కరి హెల్త్ ప్రొఫైల్ ను డిజిటల్ రూపంలో నిక్షిప్తం చేయాలని భావిస్తోంది. ఇందుకోసం డిజిటల్ హెల్త్ కార్డులను ఇవ్వాలని సర్కార్ సన్నాహాలు చేస్తోంది. ఈ నేపథ్యంలోనే తెలంగాణ వైద్యారాగ్య శాఖ దీనిపై కసరత్తు ప్రారంభించనట్లు తెలుస్తోంది. రాష్ట్రంలో 18 ఏళ్లు పైబడిన ప్రతి ఒక్కరికీ డిజిటల్ హెల్త్‌కార్డులను అందజేయడంతో పాటు ఒక ప్రత్యేక గుర్తింపు సంఖ్యను కేటాయించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు డిజిటల్ హెల్త్ కార్డులు ఎంతో ఉపయోగపడతాయని అధికారులు భావిస్తున్నారు. డిజిటల్ హెల్త్ కార్డుల ద్వారా ప్రజల ఆరోగ్య సమస్యల సమాచారం అంతా నిక్షిప్తంకానుంది. హెల్త్ కార్డుల్లో వ్యక్తి ఆరోగ్యానికి సంబంధించిన వివరాలు, గతంలో తీసుకున్న చికిత్సకు సంబంధించిన వివరాలను పొందుపర్చనున్నారు. దీని ద్వారా ప్రభుత్వ ఆసుపత్రుల్లోని వైద్యులకు వెంటనే ఆ వ్యక్తి యొక్క ఆరోగ్య విషయాలు తెలియడంతో సత్వరమే మెరుగైన చికిత్స, వైద్యసేవలకు అవకాశం ఉంటుందని అధికారులు తెలిపారు. అదే విధంగా ప్రజలకు అందించాల్సిన వైద్య సేవలు, ప్రభుత్వ ఆసుపత్రులను బలోపేతం చేయడం, వైద్య సదుపాయాలు అందరికీ అందేలా చేయడం, ఆసుపత్రుల్లో మెరుగైన వసతులు కల్పించడం వంటి అంశాలపై ప్రభుత్వం సమీక్ష చేస్తోంది.

ఈ కార్డును ఆరోగ్యశ్రీ, ఆధార్‌తో అనుసంధానం చేయనున్నట్లు వెల్లడించారు. డిజిటల్ హెల్త్ కార్డులల్లో పొందుపరచాల్సిన అంశాలపై అధికారులు కసర్తు ప్రారంభించారు. త్వరలోనే హెల్త్ కార్డులను అందించేందుకు తెలంగాణ సర్కార్ రెడీ అవుతోంది.

## మేడారం జాతరకు వెళ్లలేని భక్తుల మొక్కుల సమర్పనకు దేవాదాయ శాఖ కీలక నిర్ణయం



హైదరాబాద్, ఫిబ్రవరి 07 (తీన్మార్ న్యూస్): మేడారం జాతర భక్తుల కోసం తెలంగాణ దేవాదాయ శాఖ కీలక ప్రకటన చేసింది. మేడారం జాతరకు వెళ్లలేని భక్తులు మొక్కులు సమర్పించుకునేందుకు దేవాదాయ శాఖ అవకాశం కల్పించింది. సమ్మక్క-సారలమ్మకు నిలువెత్తు బంగారం (బెల్లం) సమర్పించే సదుపాయాన్ని కల్పించింది. ఈ మొక్కుల చెల్లింపునకు ఆన్‌లైన్ సదుపాయం కల్పించింది దేవాదాయ శాఖ. మీ సేవ, పోస్టాఫీసులు, టీయాప్ ఫోలియో ద్వారా బుక్ చేసుకోవచ్చు. బరువు ప్రకారం డబ్బులు చెల్లించి మొక్కు సమర్పణ సేవ బుక్ చేసుకునే అవకాశం కల్పించింది. కిలోకు రూ. 60 చెల్లించి బరువుకు తగిన బంగారం నమర్పించొచ్చు. ఆన్‌లైన్‌లో మేడారం నమ్మక్క-సారలమ్మ ప్రసాదం పొందే అవకాశం కూడా కల్పించింది దేవాదాయ శాఖ. డబ్బులు పంపిస్తే కొరియర్ ద్వారా ప్రసాదం పంపించనుంది తపాలా శాఖ. ఈ మేరకు మేడారం ఆన్‌లైన్ సేవలను మంత్రి కొండా సురేఖ ప్రారంభించింది.

## రిజిస్ట్రేషన్ లేని ప్రార్థనా స్థలాలపై హైకోర్టు కీలక ఆదేశాలు జారీ

తెలంగాణ బ్యూరో, ఫిబ్రవరి 07 (తీన్మార్ న్యూస్): కొత్త బాకారంలోని జివిఎం రోడ్ నుంచి ముషీరాబాద్ రోడ్డు వరకు ఉన్న దేవాలయం, మసీదుతోపాటు రిజిస్ట్రేషన్ లేని ప్రార్థనా స్థలాలపై తెలంగాణ హైకోర్టు కీలక ఆదేశాలు జారీచేసింది. అక్రమ నిర్మాణాలను తొలగించాలని ఫిబ్రవరి 6 మంగళవారం జిహెచ్ఎంసి, రెవెన్యూ అధికారులను ఆదేశించింది. మూడు వారాల్లో స్టేటస్ రిపోర్టు ఇవ్వాలని కూడా హైకోర్టు కోరింది. ఇరువైపులా ఉన్న ఆక్రమణలను తొలగించాలని కోర్టు ఆదేశించినా అధికారులు చర్యలు తీసుకోకపోవడంపై శతాబ్ది నిలయం ఫ్లాట్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్‌కు చెందిన కె శ్రీధర్ రెడ్డి స్పందించారు. హైకోర్టులో దీనిపై పిటిషన్ దాఖలు చేశారు. గతంలో ఇచ్చిన కోర్టు ఆదేశాల ధిక్కార కేసుపై జస్టిస్ అభినంద్ కుమార్ షావిలి, జస్టిస్ నామవరపు రాజేశ్వర్ రావులతో కూడిన డివిజన్ బెంచ్ తాజాగా ఈ ఆదేశాలు జారీ చేసింది. ముషీరాబాద్‌లోని జనప్రియ అబోడ్స్ అపార్ట్‌మెంట్‌కు వెళ్లే రహదారి అక్రమ నిర్మాణాలపై శ్రీధర్‌రెడ్డి 2022లో హైకోర్టును ఆశ్రయించారు. దీంతో ఆక్రమణలను తొలగించాలని కలెక్టర్, జీహెచ్ఎంసీ అధికారులను కోర్టు ఆదేశించింది. 2023 నాటి కోర్టు ఆదేశాలను పాటించకపోవడంతో అప్పటి ఎంఏయూడీ ప్రిన్సిపల్ సెక్రటరీ అరవింద్ కుమార్, జీహెచ్ఎంసీ చీఫ్ లోకేశ్ కుమార్, కలెక్టర్ అమోయ్ కుమార్‌లను ప్రతివాదులుగా పేర్కొంటూ ధిక్కార కేసు నమోదు చేసింది ధర్మాసనం. అధికారులను బదిలీ చేసినా ఎలాంటి చర్యలు లేవని పిటిషనర్ వాపోయారు. ఆ తర్వాత జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్, కలెక్టర్ అనుదీప్ దురిశెట్టికి కోర్టు సమన్లుజారీ చేసింది. ఇద్దరు అధికారులు కోర్టుకు హాజరై నాలుగు వారాల్లోగా కోర్టు ఆదేశాలను పాటిస్తామని చెప్పారు. గుడి అయినా, మసీదు అయినా ఏదైనా నిర్మాణాన్ని రోడ్డు మార్జిన్‌లో ఉంచితే దానిని తరలించే అవకాశం ఉందని కోర్టు పేర్కొంది.

## నేడు ఆప్షనల్ హాలిడేగా ప్రభుత్వ ఉత్తర్వులు

తెలంగాణ బ్యూరో, ఫిబ్రవరి 07 (తీన్మార్ న్యూస్): తెలంగాణలో నేడు (బుధవారం) స్కూళ్లు, కాలేజీలకు సెలవు ప్రకటిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. వీరితో పాటు ఉద్యోగులకు కూడా సెలవులను ప్రకటించింది ఫిబ్రవరి 8న తెలంగాణ ప్రభుత్వం పబ్లిక్ హాలిడేగా ప్రకటించింది. నేడు షబ్-ఎ-మెరాజ్ పండుగ. ఇది ముస్లింలు జరుపుకునే పండుగ. ఈ పండుగ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం పబ్లిక్ హాలిడేగా ప్రకటించింది. ఈ మేరకు ఉత్తర్వులు కూడా జారీ చేసింది. ఇక, తెలంగాణ ప్రభుత్వం విడుదల చేసిన సెలవుల క్యాలెండర్లో ఫిబ్రవరి 8వ తేదీని షబ్-ఎ-మెరాజ్కు ఆప్షనల్ హాలిడేగా ప్రకటించారు. ఫిబ్రవరి 8న సాధారణ సెలవుగా కాకుండా ఆప్షనల్ హాలిడేగా ఉత్తర్వుల్లో తెలిపింది. ఈ పండుగ రోజును ముస్లింలు ఎంతో పవిత్రమైన రోజుగా భావిస్తారు. రాత్రంతా జాగారం చేస్తారు. అంతేకాదు ఆ రాత్రంతా వారు ప్రార్థనలు చేస్తూనే ఉంటారు. అందుకే తెలంగాణ ప్రభుత్వం నేడు పాఠశాలలకు, కళాశాలలకు సెలవు దినంగా ప్రకటించింది.

## రాష్ట్రం కోసం పోరాడే చిత్తశుద్ధి బీఆర్ఎస్ కె ఉంది : ఎమ్మెల్యే కడియం శ్రీహరి

హైదరాబాద్, ఫిబ్రవరి 07 (తీన్మార్ న్యూస్): తెలంగాణ రాష్ట్రం గురించి పోరాడే చిత్తశుద్ధికే ఉందని బీఆర్ఎస్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. మన గొంతును పార్లమెంటులో వినిపించేది బీఆర్ఎస్ మాత్రమేనని స్పష్టం చేశారు. అందుకే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ సభ్యులను గెలిపించుకోవాలని కోరారు. జనగామ నియోజకవర్గ ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశంలో కడియం శ్రీహరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కడియం శ్రీహరి మాట్లాడుతూ రాజకీయాల్లో గెలుపోటములు సహజమని అన్నారు. ఓటమి ద్వారా వచ్చిన అనుభవాలను విజయం సాధించే దిశగా ప్రయాణం సాగించాలని సూచించారు. తెలంగాణలో ప్రజలు మార్పు కోరుకున్నారని.. కాంగ్రెస్ పార్టీ అమలు చేయలేని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందని బీఆర్ఎస్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. కాంగ్రెస్ పార్టీ 420 హామీలతో కాంగ్రెస్ ప్రజలను మోసం చేసి గెలిచిందని అన్నారు. ఎన్నికలకు ముందు రేవంత్ రెడ్డి ఎన్నో మాటలు చెప్పారని గుర్తుచేశారు. డిసెంబర్ 9వ తేదీన రూ.2 లక్షల రుణమాఫీపై సంతకం చేస్తానని కొత్తగా రుణాలు తీసుకోవాలని చెప్పారనన్నారు. రైతు భరోసా కింద 3 హామీలను ఇచ్చారని రైతులకు ఒక్క హామీ అయినా అమలు అయ్యిందా.. అని ప్రశ్నించారు. అధికారంలోకి వచ్చి 60 రోజులు పూర్తయ్యిందని కాంగ్రెస్ హామీలను నెరవేర్చిందా అని నిలదీశారు. పార్లమెంట్ ఎన్నికల కోడ్‌ను సాకుగా చూపించి హామీల నుంచి తప్పించుకోవాలని కాంగ్రెస్ ప్రయత్నిస్తుందని ఆరోపించారు. అధికారంలోకి వచ్చిన మొదటి రోజు నుంచే కాంగ్రెస్ గ్రాఫ్ పడిపోతుందని ఆయన విమర్శించారు. రేవంత్ రెడ్డి భాష అతని వ్యక్తిత్వాన్ని చెబుతుందని సీఎం తన భాష మార్చుకోవాలని సూచించారు. తెలంగాణ హక్కులను కాపాడాలని కృష్ణా నదిపై ఉన్న ప్రాజెక్టులను రక్షించాలని ప్రజల పక్షాన పోరాడేందుకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఈ నెల 13న నల్గొండలో భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నారని తెలిపారు.

## వైద్యారోగ్య విభాగంలో డిప్యుటేషన్లు రద్దు చేస్తూ ఉత్తర్వులు

హైదరాబాద్, ఫిబ్రవరి 07 (తీన్మార్ న్యూస్): రాష్ట్ర వైద్యారోగ్య, కుటుంబ సంక్షేమ విభాగంలో డిప్యుటేషన్లు రద్దు చేస్తూ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు వైద్యారోగ్య శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. డిప్యుటేషన్‌లో ఉన్నవారు తమ పూర్వస్థానాల్లో రిపోర్ట్ చేయాలని ఆదేశించింది. ఈ నెల 8వ తేదీన సాయంత్రం లోపు రిపోర్ట్ చేయాలని, లేని యెడల చర్యలు ఉంటాయని తెలిపింది.

## టీఎస్ఆర్టీసీలో ఆందోళన రేకెత్తిస్తోన్న వరుస దాడులు

**మొదటి పేజీ తరువాయి**

ఫరూక్‌నగర్ డిపో బస్సులో డ్రైవర్, కండక్టర్‌లపై జరిగిన దాడిని ఆయన ఖంచింన సంగతి తెలిసిందే. తాజాగా గాయపడిన ఆ సిబ్బందిని పరామర్శించారు. హైదరాబాద్ తార్నాకలోని టీఎస్ఆర్టీసీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారి ఆరోగ్య పరిస్థితితో పాటు దాడి జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. టీఎస్ఆర్టీసీ అండగా ఉంటుందని, ఈ విషయంలో ఎలాంటి ఆందోళన చెందవద్దని భరోసా కల్పించారు. వారికి మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను ఆదేశించారు. ఇక నుంచి ఆర్టీసీ సిబ్బందిపై దాడులకు పాల్పడితే తీవ్రమైన కఠిన చర్యలుంటాయని ఈ సందర్భంగా హెచ్చరించారాయన. గాయపడ్డ కండక్టర్, డ్రైవర్‌కు టీఎస్ఆర్టీసీ పూర్తిగా అండగా ఉంటుంది. ఫరూక్ నగర్ డిపో బస్సులో విధులు నిర్వర్తిస్తోన్న డ్రైవర్, కండక్టర్ పై ఇద్దరు దుండగులు విచక్షణరహితంగా దాడి చేశారు. బస్సును రోడ్డుపై ఆపి క్రికెట్ బ్యాట్ తో వారిని తీవ్రంగా కొట్టారు. ప్రజల మధ్య విధులు నిర్వర్తించే టీఎస్ఆర్టీసీ సిబ్బందిపై దౌర్జన్యం చేస్తే తీవ్రమైన కఠిన చర్యలుంటాయి. ఆర్టీసీ సిబ్బందిపై దాడులు చేస్తే ఇక ఉపేక్షించం. ఇక నుంచి రౌడీ షీట్‌లు కేసులు తెరుస్తాం అని సజ్జనార్ హెచ్చరించారు. ఇక ఈ ఘటనపై ఫిర్యాదు చేయగానే హైదరాబాద్ కమిషనరేట్ దోమల్ గూడ పోలీసులు వెంటనే స్పందించారని సజ్జనార్ చెప్పారు. కేసు నమోదు చేసిన పోలీసులు నిందితులు మహ్మద్ మజీద్, మహ్మద్ ఖాసీంలను సోమవారం అరెస్ట్ చేశారని తెలిపారు. కాగా ఫరూక్‌నగర్ డిపోకు చెందిన 8ఏ రూట్ బస్సులో విధులు నిర్వర్తిస్తోన్న డ్రైవర్, కండక్టర్ పై ఇద్దరు దుండగులు విచక్షణరహితంగా దాడి చేశారని, ఈ ఘటనలో కండక్టర్ రమేష్, డ్రైవర్ షేక్ అబ్దుల్‌కి గాయాలయ్యాయని టీఎస్ఆర్టీసీ ప్రకటించింది. హైదరాబాద్ ట్యాంక్ బండ్ పై ఈ నెల 4న జరిగిందీ సంఘటన.

తీన్మార్
తెలుగు దినపత్రిక

## అమెరికా రుణం ప్రపంచ వ్రణం

అమెరికాకు అభివృద్ధి చెందిన సంపన్న దేశమని పేరు. ఈ సంపదలో విదేశాల ప్రత్యక్ష, పరోక్ష సహకారం చాలా ఉంది. స్వదేశాల్లో కోట్ల ఖర్చు తో చదువుకొన్న విద్యావంతులు ఉన్నత చదువులకుపోయి అమెరికాకు కోట్లు చెల్లిస్తారు. డాలర్ మారక విలువ పెరగడంతో ఆ విద్యార్థులపై ఖర్చు విపరీతంగా పెరుగుతోంది. స్వదేశాల్లో ఉపాధి లేమి, పెరిగిన డాలర్ విలువ, మెరుగైన అమెరికా సామాజిక సౌకర్యాల కారణాలతో ఆ విద్యార్థులు ఉన్నత చదువుల తర్వాత అమెరికాలోనే ఏదో ఒక ఉద్యోగం వెతుక్కొని అక్కడే నిలబడతారు. ఆ దేశ పౌరులుగా స్థిరపడతారు. అమెరికాకు పెట్టుబడి అవసరం లేని, తులనాత్మకంగా తక్కువ జీతాలకు పని చేసే, తయారీ మానవ వనరులుగా మారుతారు. స్థానిక రాజకీయాలు, కార్మిక సంఘాల నిరసన ఉద్యమాల్లో తలదూర్చకుండా పొదుపుగా జీవిస్తూ డబ్బు మిగిల్చి అమెరికా ఆర్థిక వ్యవస్థను బలపరుస్తారు. తమ బంధుమిత్రుల అవసరార్థ పర్యటనలతో అమెరికాకు ఆదాయం కల్పిస్తారు. అయినా అమెరికా అన్ని దేశాల నుండి అప్పులు తీసుకుంది. ఇండియా లాంటి దేశాలు ఈ ఉన్నత చదువుల మేధావులకు ఉపాధి అవకాశాలు కల్పించదు. కొంత కాలం ఉద్యోగం చేసిన తర్వాత లేదా చదువుల అప్పులు తీరిన తర్వాత స్వదేశానికి తిరిగి రావాలని నియమాలు విధించదు. ప్రధాని, నా పాలనలో ఉపాధులు పెంచాను. మేధావులను సవ్యంగా ఉపయోగించుకునే పథకాలు రచించాను. మీకు ఉద్యోగాలకు కొదవ లేదు. ఇండియాకు వచ్చి దేశ అభివృద్ధిలో భాగస్వాములు కండి అనరు. కోడి ఏ దొడ్లో మేసినా నా పెరట్లో గుడ్లు పెడితే చాలన్నట్లు, ఇండియాకు ఆర్థిక సాయం చేయండి.మా పార్టీకి నిధులు ఇవండి. మీ బంధు మిత్రులతో నాకు ఓట్లు వేయించండి అంటారు. సోవియట్ యూనియన్, తూర్పు ఐరోపా సోషలిస్టు దేశాలు అభివృద్ధి చెందుతున్న దేశాల విద్యార్థులకు ఉచితంగా చదువు చెప్పేవి. చదువు పూర్తి కాగానే స్వదేశాలకు పోయి తమ దేశాల అభివృద్ధికి పాటు పడాలన్న నియమం విధించాయి.అధిక వడ్డీ రేట్లతో అమెరికా రుణ భారం పెరుగుతూనే ఉంది. అమెరికా ఆర్థిక స్థిరత్వ కొనసాగింపు కష్టతరంగా మారుతోంది. అమెరికా ఖజానా శాఖ ఇటీవల ఖజానా అంతర్జాతీయ పెట్టుబడి నివేదికను విడుదల చేసింది. దాని ప్రకారం విదేశీ పెట్టుబడిదార్ల వద్ద ఉన్న అమెరికా ఆర్థిక ఒప్పంద పత్రాల (బాండ్ల) మొత్తం 2023 అక్టోబర్‌లో 3,900 కోట్ల డాలర్లు తగ్గి 7.56 లక్షల కోట్ల డాలర్లకు దిగింది. ఈ తగ్గుదల ఆగస్టు నుండి కొనసాగుతోంది. ఈ ఆర్థిక పతన వివరాలు రెండు నెలల నుండి మార్కెట్ తీరును ప్రతిబింబించినప్పటికీ, అమెరికా ఖజానా మార్కెట్‌లో బాండ్లు ఎక్కువగానే జారీ అవుతున్నాయని కొందరి విశ్లేషకుల అభిప్రాయం. అమెరికాలో వడ్డీ రేట్లు తగ్గలేదు, పెరుగుతున్నాయి. అందువలన కార్పొరేట్ సంస్థలు ఎగవేతదారులుగా మారే ప్రమాదం పెరుగుతుందని అంతర్జాతీయ ద్రవ్యనిధి 2023 అక్టోబర్‌లో హెచ్చరించింది. ఆర్థిక వృద్ధి ఊపు లేకపోవడం, అధిక ద్రవ్యోల్బణం, పెరిగిన ప్రభుత్వ లోటు నిష్పత్తి కారణంగా అమెరికాకు అప్పుల అవసరం పెరిగింది. ఫలితంగా అప్పుల సేకరణ, రుణ పత్రాల జారీలను ఆపడం దానికి కష్టతరమైంది. దాని జాతీయ రుణాలు రోజురోజుకూ పెరగడానికి ఈ పరిస్థితులే కారణం. అదే సమయంలో, సమాఖ్య సంక్షేమ మూలనిధి (ఫెడరల్ రిజర్వ్) 11 సార్లు వడ్డీ రేటును పెంచింది. దానితో అమెరికా సమాఖ్య వడ్డీ రేటు 5.25% నుండి 5.5 శాతానికి పెరిగింది. దీంతో బ్యాంకులు, పెన్షన్ సంస్థలు, ఇతర సంస్థాగత పెట్టుబడిదారులకు దీర్ఘకాలిక అమెరికా బాండ్ల నిర్వహణ తక్కువ లాభదాయకంగా మారింది. 2023 ఆర్థిక సంవత్సరానికి అమెరికా బడ్జెట్ లోటు 1.70 లక్షల కోట్ల డాలర్లు. అంటే ఏడాదికి 32 వేల కోట్ల డాలర్లు లేదా 23 శాతం పెరిగింది. ఆర్థిక లోటు, బాండ్ల జారీ, వడ్డీ చెల్లింపులు, మరింత పెద్ద ఆర్థిక లోటు అనే విష వలయంలోకి అమెరికా పీకల లోతుకు కూరుకుపోయిందని కొందరు విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ప్రపంచ వాణిజ్య పరిష్కారం, కేంద్ర బ్యాంకుల విదేశీ మారక నిల్వలు, ప్రపంచ రుణ మదింపు, ప్రపంచ మూలధన ప్రవాహాలలో అమెరికా డాలర్ ఇప్పటికీ ఆధిపత్య స్థానాన్ని ఆక్రమించింది. అయితే అమెరికా ప్రభుత్వం డాలర్ స్థిరస్థితిని దుర్వినియోగం చేస్తోంది.డాలర్ పలుకుబడిని స్వప్రయోజనాలకు ఎక్కువగా వాడుకుంటోంది. అమెరికా దుష్ప్రవర్తన ప్రపంచ దేశాల్లో అమెరికా పట్ల అపనమ్మకాన్ని పెంచింది. ప్రత్యామ్నాయ అంతర్జాతీయ ద్రవ్య వ్యవస్థను వెతుక్కునే స్థితికి వాటిని నెట్టింది. కొంతమంది విదేశీ పెట్టుబడిదారులు ప్రధానంగా జపాన్, యునైటెడ్ కింగ్‌డమ్, కెనడా, ఫ్రాన్స్ వంటి అమెరికా మిత్ర దేశాలు ఈ ఏడాది అమెరికా ఖజానాతో లావాదేవీలను పెంచుకున్నప్పటికీ ఎక్కువ దేశాలు అమెరికా ఖజానాలో తమ ఆర్థిక పెట్టుబళ్ళను తగ్గించుకుంటూనే ఉన్నాయి.అమెరికా ఖజానా కార్యదర్శి జానెట్ యెల్లెన్, సమాఖ్య ప్రభుత్వం తన అప్పుల చెల్లింపులో విఫలమైతే అమెరికాలో ఆర్థిక మాంద్యం ఏర్పడుతుందని 2023 జనవరి మొదట్లోనే హెచ్చరించారు. ఆ సమయంలో అమెరికా అప్పు 31.4 లక్షల కోట్ల డాలర్లకు చేరింది. కానీ ఒక సంవత్సరం కంటే తక్కువ సమయంలో అది 33.94 లక్షల కోట్ల డాలర్లకు చేరుకుంది. 29 డిసెంబర్ 2023 నాటికి 34 లక్షల కోట్ల డాలర్లకు చేరింది. అమెరికా అప్పులున్న మొదటి 5 దేశాలు: జపాన్ 1,09,820 కోట్ల డాలర్లు (మొత్తం అప్పులో 14.52%), చైనా 76,960 కోట్ల డాలర్లు (మొత్తం అప్పులో 10.17%), ఇంగ్లండ్ 69,300 కోట్ల డాలర్లు (మొత్తం అప్పులో 9.16%),లక్జెంబర్గ్ 34,540 కోట్ల డాలర్లు (మొత్తం అప్పులో 4.57%), కేమన్ ద్వీపాలు 32,380 కోట్ల డాలర్లు (మొత్తం అప్పులో 4.28%). అమెరికా ఆర్థిక వ్యవస్థ నియమాల ప్రకారం అది ఏ దేశం నుండి అయినా అప్పు తీసుకోవచ్చు. అంటే రుణ పత్రాలు అమ్మవచ్చు. అమెరికా మన దేశానికి కూడా 21,600 కోట్ల డాలర్ల అప్పు ఉంది. ఈ రుణ విస్తరణ రేటు అమెరికాతో పాటు, ఇతర ప్రపంచాన్ని భారీ ప్రమాదంలో పడేస్తోంది. ప్రపంచ వాణిజ్య పోటీలో పెట్టుబడిదారి తత్వంతో నడుస్తున్నా కమ్యూనిస్టుల పాలనలోని చైనా, సోవియట్ యూనియన్ సోషలిస్టు పంథాను సంతరించు కోని పూర్వ పోలీసు అధికారి పాలనలో కొనసాగుతున్న రష్యా, అమెరికా సామ్రాజ్యవాదాన్ని అడ్డుకుంటున్నాయి. డాలర్ ఆధిపత్యాన్ని అరికట్టడంలో అవి మరింత క్రియాశీలకంగా పనిచేయాలి. పూర్వ సమ సమాజ దేశాలు, అభివృద్ధి చెందుతున్న దేశాలు,పేద దేశాలు, భారత్ ఈ చర్యల్లో సహకరించాలి. అమెరికా డాలర్ ఆధిపత్య పతనంతోనే ప్రపంచ ప్రగతి సాధ్యం.

# ప్రభుత్వ ఆసుపత్రుల్లో కార్పోరేట్ స్థాయి వైద్యం అందాలి

**- విద్యా, వైద్యానికి అధిక ప్రాధాన్యత**

నేరేడుచర్ల, ఫిబ్రవరి 07(తీన్మార్ న్యూస్): విద్యా, వైద్యానికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని రాష్ట్ర వైద్య ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి దామోదర రాజ నర్సింహ అన్నారు. బుధవారం ముందుగా స్థానిక హుజూర్ నగర్, ఏరియా ఆసుపత్రిని సహచర మంత్రులైన రాష్ట్ర నీటి పారుదల, పౌర సరఫరాల శాఖా మంత్రి నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు తో కలసి పరిశీలించి రోగుల వార్డులలో కలియ తిరిగి అందుతున్న వైద్యం గురించి అడిగి తెలుసుకున్నారు. తదుపరి ఏర్పాటు చేసిన వైద్య వసతులపై వైద్యాధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ పేదల సంక్షేమమే ప్రభుత్వ



లక్ష్యమని పేద, నిరుపేద లకు ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన సేవాలందలని అన్నారు. ఈ నియోజక వర్గంలో మారుమూల మండలాల నుండి వచ్చే రోగులకు కార్పోరేట్ స్థాయిలో వైద్య సేవాలందలని వైద్య వృత్తి చాలా పవిత్రమైనదని అన్నారు. హుజూర్ నగర్ కోదాడ నియోజక వర్గంలో ఉన్న పిహెచ్సిలలో వసతుల కల్పన, ఏరియా ఆసుపత్రిలో కావలసిన వసతులపై ప్రతిపాదనలు సత్వరమే అందించాలని సూచించారు. వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ ఆరోగ్య శ్రీ కింద 1800 వ్యాధులకు రూ.487 కోట్లు ఖర్చు చేస్తున్నామని అలాగే రాజీవ్ ఆరోగ్య శ్రీ ని



10 లక్షలకు పెంచామని స్పష్టం చేశారు. ప్రభుత్వ ఆసుపత్రులలో కార్పోరేట్ స్థాయి వైద్యం అందాలని, అన్ని అసుప్రతులలో డైట్, శానిటేషన్, డ్రగ్స్ కొరత లేకుండా ఉంచాలని ఏ ఒక్క పేషంట్ కూడా బయట మందులు కొనుగోలు చేయకుండా ఉండాలని అలాగే రోగులకు సర్కార్ దవఖానాల పై విశ్వాసం పెరగాలని అన్నారు. ప్రభుత్వం ఇటీవల స్టాఫ్ నర్సులకు ఉద్యోగాలు అందించిందని త్వరలో వైద్యాధికారుల నియామకాలు చేపట్టుట జరుగుతుందని అన్నారు. సూర్యాపేటలో మెడికల్ కళాశాల సమస్యను త్వరలో పరిష్కరించి శంకుస్థాపన చేయడం జరుగుతుందని ఈ సందర్భంగా మంత్రి తెలిపారు.

### పేద, నిరుపేదలకు మెరుగైన వైద్యం అందిస్తాం

**- కోదాడలో 26 కోట్లతో 100 పడకల వైద్యశాల భవన నిర్మాణానికి శంకుస్థాపన.**
**- సిటీ స్కాన్, టిఫా అల్ట్రా సౌండ్ సెంటర్ మంజూరు.**
**- అసుప్రతుల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత.**
**- మంత్రులు రాజ నర్సింహ, నలమాద ఉత్తమ్ రెడ్డి, తుమ్మల నాగేశ్వర రావు.**

పేదల ప్రభుత్వంలో పేద, నిరుపేద లకు కార్పోరేట్ స్థాయి వైద్య సేవలు అందాలని ఆదిశగా వైద్యాధికారులు బాధ్యతాయుతంగా సేవాలందించాలని సూచించారు. బుధవారం స్థానిక 14 వార్డులో పాత రూ. 26 కోట్లతో చేపట్టే 100 పడకల ప్రాంతీయ వైద్య శాల భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర వైద్య శాఖ మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వ సంకల్పం అర్హులైన పేదలకు మెరుగైన వైద్యం అందాలని హైదరాబాద్ తరహాలో జిల్లాలోని సూర్యాపేట, హుజూర్ నగర్, కోదాడ లలో అందాలని అలాగే ప్రతి పి హెచ్ సి లలో మందుల కొరత ఉండకుండా చూడాలని సూచించారు. హుజూర్ నగర్, కోదాడ లలో చెరో చోట సిటీ స్కాన్,టిఫా అల్ట్రా సౌండ్ లను మంజూరు చేస్తున్నట్లు వారంలో ఏర్పాటు చేయాలని సూచించారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు మాట్లాడుతూ గతంలో మంత్రిగా ఉన్న సమయంలో ఉమ్మడి నల్గొండ జిల్లాకు సాగు నీరు అలాగే రోడ్లు కు ఎక్కువ ప్రాధాన్యత కల్పించామని ప్రభుత్వం ఇచ్చిన గ్యారెంటీలు తప్పక అమలు చేస్తామని పేర్కొన్నారు. ఆసుపత్రిల వారీగా వసతుల కల్పనపై సమీక్షించారు. ఈ సమావేశంలో శాసన సభ్యులు నలమాద ఉత్తమ్ పద్మవతి, ప్రిన్సిపాల్ సెక్రటరీ క్రిష్టినా, కమిషనర్ అజయ్, డైరెక్టర్ ఆర్.వి. కర్ణన్, జిల్లా కలెక్టర్ ఎస్. వెంకట్రావ్, అదనపు కలెక్టర్లు సి.హెచ్. ప్రియాంక, ఏ.వెంకట్ రెడ్డి, డిఎంహెచ్వో డాక్టర్ కోటాచలం, ఏరియా ఆసుపత్రుల పర్యవేక్షకులు డాక్టర్. మురళీధర్ రెడ్డి, కరుణ్ కుమార్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, ఎంపీపీ లు, జడ్పీటీసీ లు, వైద్యాధికారులు తదితరులు పాల్గొన్నారు.



# బిఆర్ఎస్ పార్టీ అవినీతి దోపిడీ కాంగ్రెస్ పార్టీపై విష ప్రచారం

**- కమీషన్లకు కక్కుర్తి పడి తెలంగాణ ప్రజలకు కేసీఆర్ తీవ్ర అన్యాయం**
**- ప్రాజెక్టులను కేఆర్ఎంబీకి అప్పగించిందే గత సీఎం కేసీఆరే**
**- తెలంగాణకు 551టీఎంసీల వాటా 299 తగ్గడానికి కారణం కేసీఆర్**
**- రాయలసీమ లిఫ్ట్ టెండర్లు భేటీకి కేసీఆర్ ఎందుకు పోలేదు**
**- కేసీఆర్ పాలనలోనే తెలంగాణ కు ఎక్కువ అన్యాయం**
**- కేసీఆర్ తెలంగాణ ప్రయోజనాలను ఆంధ్రకు తాకట్టు**
**- బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు అబద్దాలు ప్రచారం**
**- మహబూబ్ నగర్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు, దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూధన్ రెడ్డి**




దేవరకద్ర ప్రతినిధి, ఫిబ్రవరి 07(తీన్మార్ న్యూస్): కాళేశ్వరం ప్రాజెక్టు,మిషన్ భగీరథ, విద్యుత్ రంగంలో బిఆర్ఎస్ పార్టీ చేసిన అవినీతి దోపిడీ బయట పడుతుండటం తో పక్కదారి పట్టించేందుకు బీఆర్ఎస్ పార్టీ, కాంగ్రెస్ పార్టీపై విష ప్రచారం చేస్తున్నదని దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూధన్ రెడ్డి(జిఎంఆర్)ఆగ్రహం వ్యక్తం చేశారు. మహబూబ్ నగర్ జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో కృష్ణ రివర్ మేనేజ్మెంట్ కు ప్రాజెక్టుల అప్పగింతపై బిఆర్ఎస్ పార్టీ, కేసీఆర్ చేస్తున్న దుష్ప్రచారాన్ని ఖండిస్తూ టీపీసీసీ అధికార ప్రతినిధి గాల్ రెడ్డి హర్షవర్ధన్ రెడ్డి తదితర కాంగ్రెస్ నాయకులతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించిన దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూధన్ రెడ్డి(జిఎంఆర్) ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కమీషన్లకు కక్కుర్తి పడి కేసీఆర్ నీటి వాటాల్లో తెలంగాణ రాష్ట్ర ప్రజలకు తీవ్ర అన్యాయం చేశారని అన్నారు. కృష్ణా బోర్డుకు తాము ప్రాజెక్టులను అప్పగించలేదని పేర్కొన్నారు. కృష్ణా రివర్ మేనేజ్మెంట్ బోర్డుకు ప్రాజెక్టులు ఇవ్వడానికి తాము ఒప్పుకోలేదన్నారు. తెలంగాణకు నీటి కేటాయింపుల్లో మోసం చేసింది బీఆర్ఎస్ పార్టీనే కేఆర్ఎంబీకి ప్రాజెక్టులు ఇచ్చేందుకు అంగీకరించిది కూడా బిఆర్ఎస్ పార్టీనే' అని తెలిపారు. ఉమ్మడి ఏపీలో 60 ఏండ్లు కృష్ణా జలాల్లో తెలంగాణకు జరిగిన అన్యాయం కన్నా పదేండ్ల కేసీఆర్ పాలనలోనే ఎక్కువ అన్యాయం జరిగిందని గణాంకాలతో సహా వివరించారు. కేసీఆర్ అసమర్థతతోనే కృష్ణా నీళ్లలో తెలంగాణ ప్రజలకు తీరని అన్యాయం జరిగిందని, సహజ న్యాయ సూత్రాలు, పరీవాహక ప్రాంతం, కరువు ప్రభావ ప్రాంతం ఇలా ఏ ప్రాతిపదిక తీసుకున్న ఉమ్మడి ఏపీకి కేటాయించిన 811 టీఎంసీల్లో తెలంగాణకు వాటాగా 551 టీఎంసీలు, ఏపీకి 260 టీఎంసీల నికర జలాలు దక్కాల్సి ఉన్న, అందుకు విరుద్ధంగా ఏపీకి 512, తెలంగాణకు 299 టీఎంసీలు ఇచ్చేలా 2015లో చేసుకున్న ఒప్పందంపై అప్పటి కేసీఆర్ ప్రభుత్వం సంతకం చేసింది. దీంతో నీటి కేటాయింపుల్లో తెలంగాణకు తీవ్ర అన్యాయం జరిగిందని ఆంధ్ర ముఖ్యమంత్రి జగన్ తో కుమ్మక్కై కేసీఆర్ తెలంగాణ ప్రయోజనాలను ఆంధ్రకు తాకట్టు పెట్టారని వివరించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత కృష్ణా బోర్డుకు ప్రాజెక్టులు అప్పగించినట్లు కాంగ్రెస్ పై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని, ఈ దుష్ప్రచారాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు.



ముఖ్యమంత్రి ఇరిగేషన్‌శాఖ మంత్రిగా కేసీఆర్ 2023 -24 బడ్జెట్ ప్రతిపాదనల్లోనే కేఆర్ఎంబీకి శ్రీశైలం, నాగార్జునసాగర్ ప్రాజెక్టులు అప్పగిస్తున్నట్లు ప్రతిపాదిస్తూ బోర్డు నిర్వహణకు, వన్‌టైం సీడ్‌మనీ కింద రూ.200 కోట్లు కేటాయించారని జియంఆర్ తెలిపారు. కేఆర్ఎంబీకి నిధులు ఇస్తూ బడ్జెట్ కేటాయించిన దస్తావేజులను బయటపెట్టారు. కేసీఆర్, జగన్ ప్రగతి భవన్‌లో ఏకాంతంగా మాట్లాడుకున్న తర్వాతనే రాయలసీమ ఎత్తిపోతలకు బీజం పడి, తెలంగాణకు కృష్ణా నది నుంచి గ్రావిటీ ద్వారా వచ్చే 8 టీఎంసీలను రాయలసీమకు మళ్లించేలా ఇద్దరు కలిసి కుట్ర చేసి, తెలంగాణకు కెసిఆర్ అన్యాయం చేశారని తెలిపారు. 2020 జనవరిలో కేసీఆర్, జగన్ సమావేశమైతే అదే ఏడాది మే నెలలో శ్రీశైలం నుంచి రోజుకు 8 టీఎంసీలు తరలించే రాయలసీమ ఎత్తిపోతలకు ఏపీ ప్రభుత్వం జీవో ఇచ్చిందని.కేంద్రం అపెక్స్ కౌన్సిల్ సమావేశానికి పిలిచినా ఆ ప్రాజెక్టు టెండర్ల ప్రక్రియ పూర్తయ్యే దాకా వెళ్లకుండా జగన్?కు కేసీఆర్? సహకరించిందని. ఈ కారణంగా ఏపీ ప్రభుత్వం పనులు చేసుకుంటూ పోయిందని తెలిపారు. నీళ్లు, నిధులు, నియామకాల కోసం తెచ్చుకున్న తెలంగాణలో న్యాయంగా దక్కాల్సిన కృష్ణా నీటి వాటా దక్కకుండా చేసిందే కేసీఆర్ ప్రభుత్వమని మండిపడ్డారు. బిఆర్ఎస్ దృశప్రచారాన్ని ప్రజలు నమ్మరని తెలిపారు. ప్రాజెక్టులను కేంద్రానికి అప్పగించే విషయంలో కేసీఆర్, హరీశ్రావు, కేటీఆర్, బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు అబద్దాలు ప్రచారం చేస్తున్నారని టీపీసీసీ అధికార ప్రతినిధి గాల్రెడ్డి హర్షవర్ధన్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ సీనియర్ నాయకులు చంద్ర కుమార్ గౌడ్, బెన్హర్, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు సాయిబాబా, ఐ ఎన్ టి యు సి అధ్యక్షులు రాములు యాదవ్, మండల కాంగ్రెస్ అధ్యక్షులు రాఘవేందర్ రెడ్డి,అంజల్ రెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు లక్ష్మీ కాంత్ రెడ్డి, మైనార్టీ నాయకులు ఫాహిం, తదితరులు పాల్గొన్నారు.

# బడ్జెట్లో విద్యా రంగానికి 30% నిధులను కేటాయించాలి

**- ఖమ్మం జిల్లా కేంద్రంగా ప్రభుత్వ జనరల్ యూనివర్సిటీని ఏర్పాటు చేయాలి**
**- మంత్రి పొంగులేటి కి వినతి పత్రం అందజేత**
**- ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి టి. ప్రవీణ్**




ఖమ్మం జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 07(తీన్మార్ న్యూస్): భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ ఖమ్మం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి క్యాంప్ ఆఫీసులో వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ప్రవీణ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టబోయే బడ్జెట్లో విద్య రంగానికి 30 శాతం నిధులను కేటాయించాలని, తెలంగాణ రాష్ట్రంలో ఉమ్మడి తొమ్మిది జిల్లాలలో ప్రభుత్వ యూనివర్సిటీలు ఉన్నాయని ఖమ్మం జిల్లా కేంద్రంలో కూడా ప్రభుత్వ జనరల్ యూనివర్సిటీని ఏర్పాటు చేయాలని అలాగే రాష్ట్ర వ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ గురుకులాలకు జనరల్ హాస్టళ్లకు సొంత భవనాలను నిర్మించాలని పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్ చార్జీలను పెంచాలని




పెండింగ్లో ఉన్న స్కాలర్షిప్స్ రియంబర్స్మెంట్స్ ను వెంటనే విడుదల చేయాలని, పలు రకాలైన విద్యారంగ సమస్యలను వినతి పత్రం ద్వారా మంత్రికి అందజేశామని తెలిపారు. వినతిపత్రం ద్వారా అందించిన సమస్యలన్నిటిని అసెంబ్లీలో ప్రస్తావించి విద్యారంగ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని మంత్రి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు పర్వీన్, జిల్లా నాయకులు తరుణ్, శరణ్య, వెంకటలక్ష్మి, రాజు, తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో పెండింగ్ లో ఉన్న ఫీజు రీయింబర్స్మెంట్

## స్కాలర్షిప్ లను వెంటనే విడుదల చేయాలి

**- ఏబివిపి**

**- విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారు**




ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 07(తీన్మార్ న్యూస్): రంగారెడ్డి జిల్లా, ఇబ్రహీంపట్నం సాగర్ జాతీయ రహదారి అంబేద్కర్ చౌరస్తా వద్ద రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్ లో ఉన్న 5300కోట్లకు పైగా ఫీజు రీయింబర్స్మెంట్ స్కాలర్షిప్ లను విడుదల చేయాలని ఏబీవీపీ ఆద్వర్యం లో రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు విద్యార్థుల ర్యాలీతో వెళ్లి, రాస్తారోకో నిర్వహించారు. అనంతరం విద్యార్థి నాయకులను అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్ కు తరలించారు. ఈ సందర్భంగా ఏబీవీపీ రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యులు కందడి శ్రీరామ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ఏర్పాటై రెండు నెలలు గడుస్తున్నా విద్యా వ్యవస్థలో ఇబ్బందులతో రాష్ట్రంలో విద్యార్థులు సతమతం అవుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఫీజు రీయింబర్స్మెంట్ విడుదల చేసి పేద మధ్యతరగతి విద్యార్థులందరికీ న్యాయం చేయాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్లో ఉన్న 5300 కోట్ల కు పైగా పాత బకాయిలను ఫీజు రియంబర్స్మెంట్,స్కాలర్షిప్లను వెంటనే విడుదల చేయాలనీ, స్కాలర్షిప్లను ప్రతి నెలకు 3500 రూల చొప్పున ప్రతీ విద్యార్థి అకౌంట్లలో వేయాలని అన్నారు.కొత్త ప్రభుత్వం ఏర్పడితే భాధలు తీరుతాయి అనుకుంటే విద్యావ్యవస్థ నిర్వీర్యం చేస్తుందని అన్నారు. ఈ ప్రభుత్వం స్పందించి సమస్యను పరిష్కరించాలని లేకుంటే రానున్న రోజుల్లో పెద్దఎత్తున ఉద్యమాలు చేయల్సివస్తదని అన్నారు. ఈ యొక్క కార్యక్రమంలో ఏబీవీపీ గ్రేటర్ హైదరాబాద్ జాయింట్ సెక్రటరీ వంగ సంజీవ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పయ్యంశెట్టి జగదీష్, శివకృష్ణ, ఎస్ ఎఫ్ ఎస్ విభాగ్ కన్వీనర్ సాయికిరణ్, హైదరాబాద్ కార్యవర్గ సభ్యులు సందీప్, నగర కార్యదర్శి రుద్రపాల మహేందర్, మైలారం పవన్, గుంజ నవీన్, చరణ్, ఆదర్శ్, నితిన్, వినయ్, నాని, ఆదిత్య, ఆశ్వాంత్, ఏశ్వంత్, వీరపట్నం, మాల్, కందుకూరు, మంచాల్ నాయకులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# పార్లమెంట్ ఎన్నికల్లో స్థానికులకు మాత్రమే

## మహబూబ్ నగర్ ఎంపీగా అవకాశం ఇవ్వాలి

**- పాలమూరు అభివృద్ధి ఫోరం చైర్మన్ మున్నూరు రవి**




పెబ్బేరు, పిబ్రవరి 07(తీన్మార్ న్యూస్): రాబోతున్న పార్లమెంటు ఎన్నికల్లో మహబూబ్ నగర్ ఎంపీ టికెట్ ను స్థానిక అభ్యర్థులకే కేటాయించాలని, అన్ని రాజకీయ పార్టీలు ఈ విషయంపై ప్రత్యేక దృష్టి సారించాలని మహబూబ్ నగర్ అభివృద్ధి ఫోరం చైర్మన్ మున్నూరు రవి కోరారు. ఇప్పటివరకు స్థానికేతరులైన ఎంపీలు మహబూబ్ నగర్ నుంచి ప్రాతినిధ్యం వహించడంతో ఈ ప్రాంత సమస్యలను గాలికి వదిలేసి వాళ్లు ఢిల్లీకి పరిమితమయ్యారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పార్లమెంటు సభ్యుడు పరిధిలో వందల స్కీములు ఉంటాయని వీటిని గ్రామీణ ప్రాంత యువతకు అందేలా చేస్తే గ్రామ స్వరాజ్యం స్థాపితం అవుతుందని ఆయన ఆశాభవం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మహబూబ్‌నగర్ డెవలప్ చైర్మన్ మున్నూరు రవి మాట్లాడుతూ బాధ్యతాయుతమైన పార్లమెంటు సభ్యులు స్థానికులు అయితేనే ఈ ప్రాంతానికి న్యాయం జరుగుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. మహబూబ్నగర్ పార్లమెంటు స్థానం ఏర్పడిన నాటి నుంచి ఇప్పటివరకు 17 సార్లు ఎన్నికలు జరగగా కేవలం ఇద్దరంటే ఇద్దరు మాత్రమే ఈ ప్రాంతం నుంచి వచ్చినవారు ఎంపీ అయ్యారని ఆయన గుర్తు చేశారు. ప్రధాన రాజకీయ పార్టీలన్నీ స్థానికేతరులు అనే ఎంపీ అభ్యర్థు లుగా ఎంచుకోవడం వెనుక బలమైన కారణాలు రెండే రెండు ఉన్నాయని ఒకటి డబ్బు మరొకటి మద్యం విచ్చలవిడిగా పంచె నేతలనే గుర్తిస్తు న్నారని ఆయన మండిపడ్డారు. స్థానికేతర్లైన వారు ఎంపీలుగా గెలిచి ఢిల్లీలో కూర్చోవడంతో ఈ ప్రాంత ప్రజలు ఉపాధి కరువై పొట్ట చేత పట్టుకొని వలసలు వెళ్లిపోతున్నారని ఆయన ఆవేదన వ్యక్తంచేశారు. స్థానికేతరులైన వారు ఇక్కడ ఎంపీలుగా గెలిచిన తర్వాత ప్రజల ఇబ్బందులు తెలుసుకోవడానికి కనీసం ఒక క్యాంపు కార్యాల యం కూడా ఏర్పాటు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తు న్నారని ఆయన దుయ్యబట్టారు. అన్ని రాజకీయ పార్టీలు తమ స్వార్థం వీడి స్థానికులైన అభ్యర్థులకే ఎంపీ టికెట్లు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. స్థానికులకు ఎంపీ టికెట్లు కేటాయిస్తే ఈ ప్రాంత ప్రజల అమితమైన ఆదరణతో వాళ్లు గెలవడమే కాకుండా గెలిచినవారు కూడా ఇక్కడి సమస్యలపై వారికి పూర్వ అవగాహన ఉన్నడంతో అభివృద్ధి జరుగుతుందని ఆయన గుర్తు చేశారు ఎంపీలుగా గెలిచిన వారికి లక్షలాది రూపాయల వేతనం కింద చెల్లించడంతో పాటుగా ఇతరత్రా సౌకర్యాలు కల్పిస్తున్నదని ప్రజలకు సేవ చేయకుండా తప్పించుకు తిరిగే వారికి ఇలాంటి అంటూ ఆయన నిగ్గదీశారు. స్థానికులకు ఎంపీ టికెట్ ఇవ్వాలని ఉద్యమాన్ని వ్యాపింపజేస్తామని.. త్వరలోనే అన్ని రాజకీయపార్టీ అధినేతలను కలిసి వినతిపత్రాలు ఇస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు సారంగి వినయ్ కుమార్, సామాజిక ఉద్యమకారురాలు సాజిదా సికిందర్, సీనియర్ జర్నలిస్ట్ పటేల్ వెంకటేష్, ఎండిఎఫ్ ఉపాధ్యక్షులు మొహమ్మద్ మాసిఉద్దీన్, ముదిరాజ్ సేవ సమితి అధ్యక్షులు ముసంగి వెంకటేష్, వరల్డ్ హ్యూమన్ రైట్స్ కమిషన్ జాతీయ అధ్యక్షులు బలగం పూర్ణచందర్ గౌడ్, మహమ్మద్ సమీర్, ఓంకార్, కులసంఘాల సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.




# అక్రమంగా ఇసుక రవాణా....

**- రెండు లారీలు పట్టివేత**

**- కేసు నమోదు చేసిన పోలీసులు**



చిట్యాల, ఫిబ్రవరి 07(తీన్మార్ న్యూస్): అక్రమంగా ఇసుక రవాణా చేస్తూ, ఇసుక తరలిస్తున్న రెండు లారీలు పట్టుకుని కేసు నమోదు చేశారు. బుధవారం తెల్లవారుజామున ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న రెండు లారీలను తెలంగాణ మినరల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ వారు పట్టుకొని చిట్యాల పోలీసులు కు అప్పగించగా ఇట్టి లారీ లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చిట్యాల ఎస్సై నవీన్ కుమార్ ఒక ప్రకటనలో తెలియజేశారు. వివరాల ప్రకారం మునుగోడు మండలానికి చెందిన నిమ్మల సుమన్ అనే వ్యక్తి అక్రమంగా ఇసుకను తన రెండు లారీలలో నింపుకొని భద్రాచలం నుంచి హైదరాబాద్ కు తరలిస్తుండగా చిట్యాల క్రాస్‌రోడ్ వద్ద టిఎస్ఎండిసి వారు పట్టుకొని పోలీస్ వారికి అప్పగించినారు. ఎవరైనా అక్రమంగా ఇసుక రవాణా కు పాల్పడితే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.

# ఇబ్రహీంపట్నం మార్కెట్ కమిటీ చైర్మన్

## పదవి కి అవకాశం ఇవ్వాలి

**- ముచ్చర్ల సంపత్ కుమార్**

**- పార్టీ కోసం కష్ట పడ్డవారికే పట్టం కడతాం**

**- ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి**



ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 07(తీన్మార్ న్యూస్): ఇబ్రహీంపట్నం నియోజకవర్గం, యాచారం మండల పరిధిలో ఎన్నో సంవత్సరాల నుండి కాంగ్రెస్ పార్టీని నమ్ముకుని, ఎన్నో ఒడిదుకులు ఎదుర్కొని పని చేశారని, ముచ్చర్ల సంపత్ కుమార్ అన్నారు. మార్కెట్ కమిటీ చైర్మన్ గా ముచ్చర్ల సంపత్ కుమార్ అవకాశం ఇవ్వాలని బుధవారం రోజు ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి ని కలిసి వినతి పత్రం అందజేసారు. గత 20 సంవత్సరాల నుంచి మల్ రెడ్డి రంగారెడ్డి కోసం, కాంగ్రెస్ పార్టీకి అహర్నిశలు కష్టపడుతూ, ఒకే పార్టీని, ఒకే నాయకుడిని నమ్ముకుని పార్టీకి తన సాయశక్తుల సేవలందిస్తూ కృషి చేసానని, తను చేసిన సేవలకు పార్టీ గుర్తించి తనకు తగిన న్యాయం చేస్తారని ఆశ భావం వ్యక్తం చేసారు. ఇబ్రహీంపట్నం మార్కెట్ కమిటీ చైర్మన్ ఎస్సీ రిజర్వుడు అయినందున చైర్మన్ గా అవకాశం ఇవ్వాలని కోరుకుంటు ఎమ్మెల్యే కు వినతి పత్రం ఇచ్చారు. కాంగ్రెస్ పార్టీలో కష్టపడిన వారికి తగిన గుర్తింపు ఇస్తారని మనస్పూర్తిగా నమ్ముతున్నానని కచ్చితంగా చైర్మన్ పదవి సంపత్ కుమార్ కి ఇస్తారని ఆశాభావం వ్యక్తం చేసారు. ఈ విషయంపై కాంగ్రెస్ పార్టీలో కష్టపడ్డ వారికి కచ్చితంగా తగిన గుర్తింపు ఇస్తూ, పార్టీ కోసం అహర్నిశలు పనిచేసిన వాళ్లకు న్యాయం చేస్తానని ఎమ్మెల్యే మల్ రెడ్డిరంగారెడ్డి హామీ ఇచ్చారని ముచ్చర్ల సంపత్ తెలిపారు. ఈ యొక్క కార్యక్రమంలో యాచారం మండలం వైస్ ఎంపీపీ శ్రీనివాస్ రెడ్డి, మాజీ మండల పార్టీ అధ్యక్షులు ముత్యాల వెంకట్ రెడ్డి, పెద్ద అంబర్పేట్ మున్సిపాలిటీ అధ్యక్షుడు జైపాల్ రెడ్డి, ఎంపీటీసీ అరవింద నాయక్, లక్ష్మారెడ్డి, మాజీ సర్పంచ్ దెంది మధుకర్ రెడ్డి, అఖిల్ ఖాన్, కొండల్, బాలరాజ్, జమ్మ గుండాలు, తాండ్ర మహేష్, గణేష్, వన్నాడపు శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

# ఆర్టీఐ రక్షక్ టీం ఆధ్వర్యంలో కురెళ్ళ

## విఠలాచారికి ఘనంగా సన్మానం



రామన్నపేట, ఫిబ్రవరి 07(తీన్మార్ న్యూస్): యాదాద్రి జిల్లా, రామన్నపేట మండలం, వెల్లంకి గ్రామంలో పద్మశ్రీ అవార్డు గ్రహీత డా.కూరేళ్ల విఠలాచార్య ని ఆర్టీఐ రక్షక్ వ్యవస్థాపక అధ్యక్షులు ఆర్టీఐ సతీష్ మరియు సంస్థ సభ్యులు ఆచార్య కూరేళ్ల గ్రంథాలయం నందు సన్మానించారు. ఆనంతరం ఆర్టీఐ సతీష్ మాట్లాడుతూ గురువులు కూరేళ్ల విఠలాచార్య మా సొంత గ్రామం కావడం ఎంతో సంతోషంగా ఉన్నదన్నారు. తెలుగు రచయిత, విశ్రాంత ఉపన్యాసకులు, సామాజిక వేత్త, ఆచార్య కూరేళ్ల గ్రంథాలయ స్థాపకుడు. సాహిత్యమే ఊపిరిగా ఐదు దశాబ్దాలుగా రచనలు సాగిస్తున్నాడు. కవిగా 22 పుస్తకాలను వెలువరించిన విఠలాచార్య, పదవీ విరమణ అనంతరం తన స్వగ్రామంలోని తన గృహంలో సుమారు రెండు లక్షల గ్రంథాలతో గ్రంథాలయం ఏర్పాటు చేశాడు. కలలను నిజం చేసుకోవడానికి వయస్సు అడ్డుకాదని 86 సంవత్సరాల కూరేళ్ల విఠలాచార్య మనందరికీ ఆదర్శం అన్నారు. ఇప్పుడున్న యువత విఠలాచార్య ని ఆదర్శంగా తీసుకుని ముందుకు వెళ్లాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్టీఐ రక్షక్ సభ్యులు రోశనగరి యాదయ్య, కళ్లెం ధర్మనీల, కోట సుధాకర్, కొండ మల్లేశం, లవణం ఉపేందర్, సిరా మహేష్, గంధమల్ల శ్రీనివాస్, రవి, రమేష్, శ్రీకాంత్, ఆవనగంటి స్వామి, తాటిపాముల స్వామి, తదితరులు పాల్గొన్నారు.

# నమిలె సాయితేజ జయంతి సందర్భంగా

## అనాదాశ్రమం లో అన్నదానం



యాదగిరిగుట్ట, ఫిబ్రవరి 07(తీన్మార్ న్యూస్): మండలంలోని చిన్నకందుకూరు కు చెందిన నమిలె సాయితేజ జయంతి సందర్భంగా వంగపల్లి లోని "అమ్మఒడి అనాదాశ్రమం"లో బుధవారం అన్నదానం చేశారు. ఈ సందర్భంగా చిన్నకందుకూరు మాజీ సర్పంచ్ నమిలె పాండు మాట్లాడుతూ చిన్న వయసులోనే కుటుంబ సభ్యులను, స్నేహితులను విడిచి వెళ్ళిన సాయితేజ జ్ఞాపకాలు మా వెంటే ఉంటాయని ఆయన అన్నారు. నమిలె సాయితేజ జయంతి,వర్ధంతులను అనాదాశ్రమం లో జరుపుకుంటామని ఆయన తెలిపారు."అమ్మఒడి అనాదాశ్రమానికి" మా వంతు సహాయ సహకారం అందిస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సామాజిక కార్యకర్త కొడారి వెంకటేష్, సాయితేజ కుటుంబ సభ్యులు అఖిల, శ్రావణి, అనాథ ఆశ్రమ నిర్వాహకులు చింతకింది దివ్య, సాయితేజ మిత్రులు నమిలె అభిషేక్, శ్రీకాంత్, సాయికుమార్, రాజేష్ మనోహర్, మధు, బలరాం, నవీన్, తదితరులు పాల్గొన్నారు.

# చెప్పుల దండలతో సత్కరిస్తాం

**- కాంగ్రెస్ పార్టీని విమర్శించే అర్హత లేదు**

**- బాల్క సుమన్ నోరు అదుపులో పెట్టుకోవాలి**

**- సింగిల్ విండో డైరెక్టర్ కాంగ్రెస్ నాయకులు పెద్దింటి చంద్రయ్య**



పెబ్బేరు, పిబ్రవరి 07(తీన్మార్ న్యూస్): సీఎం రేవంత్‌రెడ్డిని అసభ్య పదజాలంతో దూషించిన బాల్క సుమన్ తక్షణమే క్షమాపణ చెప్పాలని, నోరు అదుపులో పెట్టుకోకపోతే యువకులు ఆయనను చెప్పుల దండలతో సత్కరిస్తారని సింగిల్ విండో డైరెక్టర్ కాంగ్రెస్ నాయకులు పెద్దింటి చంద్రయ్య అన్నారు. మాజీ సీఎం కేసీఆర్ పెంపుడు కుక్కకు కాంగ్రెస్ పార్టీని విమర్శించే అర్హత లేదని ఆయన హెచ్చరించారు. బాల్క సుమన్ ఓటమిని తట్టుకోలేక ముఖ్యమంత్రిని విమర్శిస్తూ చెప్పు చూపించాడని, విద్యార్థులు, యువత, తెలంగాణ సమాజం చేతిలో ఆయన తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని అన్నారు. ఇలాంటి దిక్కుమాలిన నేతలను బీఆర్ఎస్ పెంచి పోషిస్తోందని విమర్శించారు. కుహనా సంస్కృతి కలిగిన సుమన్ లాంటి వ్యక్తుల వల్ల కేసీఆర్, కేటీఆర్ ఇమేజ్ పెరుగుతుందా అని ప్రశ్నించారు. కేసీఆర్, కేటీఆర్ మెప్పు కోసం పాకులాడే బాల్క సుమన్ స్థాయి ఏంటో ప్రజలందరికి అర్థం అయ్యిందన్నారు. ప్రభుత్వానికి సహకరించాల్సిన ప్రతిపక్షం చెప్పుల సంస్కృతికి స్వస్తి చెప్పాలని హితవు పలికారు. సీఎం రేవంత్‌రెడ్డికి, తెలంగాణ ప్రజలకు ఆయన క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

# బాధిత కుటుంబానికి అండగా ఉంటాం

**- వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి**



పెబ్బేరు, పిబ్రవరి 07(తీన్మార్ న్యూస్): బాధిత కుటుంబానికి అండగా ఉంటామని వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి అన్నారు. పెబ్బేరు మండలంలోని రంగాపురం గ్రామానికి చెందిన బంకుల బాలస్వామి అనారోగ్యంతో మృతి చెందాడు. ఇట్టి విషయాన్ని స్థానిక కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యే మెగా రెడ్డికి తెలియజేయగా స్థానిక నాయకులు కుటుంబ సభ్యులను పరామర్శించి, 5వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో సింగిల్ విండో డైరెక్టర్ పెద్దింటి చంద్రయ్య, గ్రామ అధ్యక్షుడు కావలి బాలస్వామి, బాపన్ పల్లి రమేష్, రాంపోగు ఆంజనేయులు, గొల్ల రాముడు, ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు దారపోగు వెంకటేష్, మండల ఉపాధ్యక్షులు బెరికి లక్ష్మణ్, ఆటో బాలస్వామి, దాది శేఖర్, కురుమన్న, తదితరులు పాల్గొన్నారు.

## టీబీజీకేఎస్ కార్యకర్తలకు అండగా ఉంటా



ంబ్బెన,: బెల్లంపల్లి ఏరియా లోని టీబీజీకేఎస్ కార్యకర్తలు, కార్మికులకు అండగా ఉంటానని ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి అన్నారు. గోలేటిటౌన్‌షిప్‌లోని టీబీజీకేఎస్ కార్యాలయంలో యూనియన్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గుర్తింపు సంఘం ఎన్నికల్లో యూనియన్ నిర్ణయం ప్రకారం పని చేసిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సింగరేణి కార్మికులకు ఎన్నో హక్కులు కల్పించారని గుర్తు చేశారు. టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు మల్రాజు శ్రీనివాసరావు, కేంద్ర కమిటీ నాయకుడు ధరావత్ మంగీలాల్, ఏరియా కమిటీ నాయకులు గజ్జెల్లి చంద్రశేఖర్, మాంతు సమ్మయ్య, మారిన వెంకటేశ్వర్లు, అలవేణి సంపత్, మాజీ ఉపాధ్యక్షుడు నల్లగొండ సదాశివ్, ఖైర్‌గూడ పిట్ కార్యదర్శి కార్నాథం వెంకటేశం, సీహెచ్‌పీ పిట్ కార్యదర్శి మెరుగు రమేశ్, వర్క్‌షాప్ పిట్ కార్యదర్శి రాజేశం, ఏరియా అసుపత్రి పిట్ కార్యదర్శి అనుముల సత్యనారాయణ, సివిల్ డిపార్టుమెంట్ పిట్ కార్యదర్శులు శ్రీనివాస్, విజ్జన్న, జీఎం కార్యాలయ అసిస్టెంట్ పిట్ కార్యదర్శి మంకయ్య, స్టోర్స్ పిట్ కార్యదర్శి రమేశ్, మహిళ నాయకురాళ్లు వరలక్ష్మి, భాగ్యలక్ష్మి, తదితరులున్నారు.

## అక్రమ నిర్మాణాలు తొలగేనా..?



ఆదిలాబాద్ :న్యూహౌసింగ్‌బోర్డు పరిధి కేసీబీ గార్డెన్ సమీపంలో గల బల్దియా స్థలంలో అక్రమంగా చేపట్టిన మడిగెల నిర్మాణాల పనులు మళ్లీ యథేచ్ఛగా సాగుతున్నాయి. ఇటీవల అక్రమ నిర్మాణాలు నిలిపివేయడంతో పాటు స్థలానికి సంబంధించిన డాక్యుమెంట్స్ తీసుకు రావాలని ఆదేశిస్తూ మున్సిపల్ కమిషనర్ ఏ.శైలజ సదరు నిర్మాణదారుడికి నోటీసులు జారీచేశారు. అయితే గడువులోపు నిర్మాణదారు ఎలాంటి డాక్యుమెంట్స్ చూప లేదు. దీంతో స్థలంపై ఎలాంటి స్పష్టత లేకపోవడంతో విషయాన్ని కమిషనర్ జిల్లా టాస్క్ ఫోర్స్ కమిటీ దృష్టికి తీసుకెళ్లారు. ఇదిలా ఉంటే నిర్మాణదారుడు గుట్టుచప్పుడు కాకుం డామళ్లీ పనులు చేపట్టడం గమనార్హం. కమిషన ర్ ఆదేశాలు బేఖాతర్ చేస్తూ కాంక్రిట్ మిక్సర్ తెప్పించి కూలీలద్వారా ఫ్లోరింగ్ పనులు దర్జాగా చేపట్టారు. మూడు మడిగెల్లో పనులు ఇప్పటికే పూర్తయ్యాయి. అక్రమంగా సాగుతున్న పనుల విషయాన్ని 'సాక్షి' మున్సిపల్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లగా వాటికి ఎ లాంటి అనుమతులు లేవని, తక్షణమే నిలిపివేయిస్తున్నట్లుగా తెలిపారు. కమిషనర్ ఆదేశాలతో అక్క డికి వెళ్లిన పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు పనులను నిలిపివేయించారు. స్థలానికి సంబంధించిన డాక్యుమెంట్స్ చూపించాలని లేకుంటే నిర్మాణాలు కూల్చివేస్తామని హెచ్చరించారు. అయితే పనుల ఆపివేత వరకే ఇది పరిమితమవుతుం దా.. అక్రమనిర్మాణాలు కూల్చివేస్తారా అనేది గురువారం వరకు వేచి చూడాల్సిందే.

## అదను చూసి.. భూమి చదును

తిరుపతి:కాలువ పోరంబోకు భూములను అధికార పార్టీ నాయకులు వరుసగా ఆక్రమించేస్తున్నారు. రెవెన్యూ అధికారులు హెచ్చరిక బోర్డు ఏర్పాటుచేసినా లెక్కలేని తనంతో అడ్డగోలుగా చదును చేసేస్తున్నారు. సుమారు రూ.2 కోట్ల విలువైన మొగిలి కశం కాలువ పోరంబోకు భూమిని కాజేయడానికి చేస్తున్న యత్నాలపై రెవెన్యూ అధికారులు స్పందించాలని ప్రజలు కోరుతున్నారు. తిరుపతి గ్రామీణ మండలం పేరూరు పంచాయతీ సర్వే నం.460, 460/2లో 2.98 ఎకరాల్లో మొగిలి కశం కాలువ పోరంబోకు భూమి విస్తరించి ఉంది. గతంలో ఆక్రమణదారులు జేసీబీతో చదును చేయడంతో రెవెన్యూ అధికారులు హెచ్చరిక బోర్డు ఏర్పాటుచేశారు. సంక్రాంతి సెలవులను అడ్డం పెట్టుకుని ఇదే అదనుగా భావించి స్థానికంగా ఉన్న నాయకులు జేసీబీతో చదును చేస్తున్నారు. ఇక్కడ ఎకరం భూమి రూ.5 కోట్లు పలుకుతోంది. సామాన్యులు సెంటు భూమి కొనలేని పరిస్థితి.

## నెలాఖరులోపు 'రైతుబంధు' పూర్తి:మంత్రి తుమ్మల

నందిపేట్, : ఎన్ని ఇబ్బందులు ఎదురైనా రైతు డిక్లరేషన్‌ను అమలు చేస్తామని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. నెలాఖరులోపు రైతుబంధు ప్రక్రియ పూర్తి చేస్తామని చెప్పారు. ఆర్థికంగా కష్టమైనా రుణమాఫీ ప్రక్రియ కూడా చేపడతామన్నారు. నిజామాబాద్ జిల్లా నందిపేట్ మండలం ఆంధ్రనగర్‌లో ఏర్పాటుచేసిన ఎన్టీఆర్ విగ్రహాన్ని మంత్రి తుమ్మల ఆవిష్కరించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్టీఆర్ శిష్యుడిగా రాజకీయాల్లోకి వచ్చిన తాను రైతు పక్షపాతిని అని, ఎన్టీఆర్ ఆశయాలకు అణుగుణంగా రైతుల కోసం పని చేస్తానన్నారు. రైతుల అవసరాలు, కష్టాలు తీర్చడానికి, అన్నదాతల భవిష్యత్తు కోసం ఎంత కష్టమైనా, ఇబ్బంది అయి నా రైతు డిక్లరేషన్‌లో ప్రకటించిన హామీలన్నీ అమలు చేస్తామని చెప్పారు. ఇప్పటికే రెండు ఎకరాల్లోపు భూమి ఉన్న 29 లక్షల మందికి రైతుబంధు డబ్బులు ఖాతాల్లో పడ్డాయని తెలిపారు. మిగతా వారికి సైతం ఈ నెలాఖరులో పూర్తి చేస్తామన్నారు. రూ.2 లక్షల పంట రుణం ఒకేసారి మాఫీ చేయడం

## చిల్లేపల్లి సహకార సంఘం చైర్మన్ గా గంగా రంగారెడ్డి బాధ్యతలు





నేరేడుచర్ల, జనవరి 07(తీర్మా న్యూస్): సూర్యాపేట జిల్లా, నేరేడుచర్ల మండలం, ముకుందాపురం గ్రామానికి చెందిన వ్యక్తి గంగా రంగారెడ్డి చిల్లేపల్లి సహకార సహకార సంఘం చైర్మన్ గా బాధ్యతలు స్వీకరించారు. చైర్మన్గా పనిచేసిన అనంతుల శ్రీనివాస్ గౌడ్ రాజీనామా చేయటంతో వైస్ చైర్మన్ అయినా రంగారెడ్డికి బాధ్యతలు అప్పగిస్తూ జిల్లా సహకార సంఘం అధికారి శ్రీధర్ ఉత్తర్వులు జారీ చేశారు. కాంగ్రెస్ పార్టీలోకి గంగా రంగారెడ్డి చేరిక కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కొనతం చిన్న వెంకటరెడ్డి కాంగ్రెస్ కండావకప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమానికి టౌన్ పార్టీ అధ్యక్షుడు సందీప్ రెడ్డి, కౌన్సిలర్ లు ప్రకాష్, నాగయ్య, చలసాని శ్రీనివాస్, చింతమల్ల సైదులు, రమాదేవి, పాండు నాయక్, ఆకారపు వెంకటేశ్వర్లు, కోటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

## చలో నల్లగొండ ను విజయవంతం చేయాలి కంచర్ల శ్రీనివాస్ రెడ్డి



రాజాపేట, ఫిబ్రవరి 07(తీన్మార్ న్యూస్): బీఆర్ఎస్ పార్టీ అధినేత మాజీ ముఖ్యమంత్రి కే చంద్రశేఖర రావు పిలుపు మేరకు కృష్ణ ప్రాజెక్టులను కేఆర్ఎంబి కి అప్పగించాలన్న రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని నిరసిస్తూ ఈనెల 13 న నలగొండ జిల్లా కేంద్రంగా నిర్వహించే బహిరంగ సభను విజయవంతం చేయాలని రాజపేట మండలం బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కంచర్ల శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ కృష్ణా జలాల పై తెలంగాణ హక్కులను కాపాడుకోవడం కోసం ఎంత వరకైనా పోరాడుతామని అన్నారు. రాజపేట మండలం నుండి సుమారు 2500 వందల నుండి 3000 వేల మంది స్వచ్ఛందంగా సభకు వస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జాల తాజా మాజీ సర్పంచ్ గుంటి మధుసూదన్ రెడ్డి, రాష్ట్ర రజక సంఘం నాయకులు సట్టు తిరుమలేష్, సెక్రెటరీ జనరల్ సందిలా భాస్కర్ గౌడ్, యువజన విభాగం మండల అధ్యక్షులు పల్లె సంతోష్, టౌన్ ప్రెసిడెంట్ బెడిదే వీరేశం, సామల రమేష్, ఎర్ర గోగుల రాజు, గజ్జల రాజు, తదితరులు పాల్గొన్నారు.

## పారిశుద్ధ్య వారోత్సవాల్లో పాల్గొన్న అదనపు కలెక్టర్ వీరారెడ్డి






రాజపేట, ఫిబ్రవరి 07(తీన్మార్ న్యూస్): మండలంలోని చల్లూరు గ్రామంలో ఈనెల 15 వరకు నిర్వహించే ప్రత్యేక పారిశుద్ధ్య వారోత్సవాల లో భాగంగా బుధవారం స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ వీరారెడ్డి గ్రామాన్ని సందర్శించి, గ్రామంలో పాదయాత్ర నిర్వహించి, ప్రజలకు అవగాహన కల్పించారు. నర్సరీలో పెంచుతున్న మొక్కలను పరిశీలించారు. ఈ కార్యక్రమములో గ్రామ ప్రత్యేక అధికారి బాధిని వెంకట రమణ, పంచాయతి కార్యదర్శి మహేష్, మాజీ సర్పంచి వీరారెడ్డి, గ్రామ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

## అనుమానాస్పద స్థితిలో విద్యార్థులు ఆత్మహత్య పై ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపి బాధ్యులను కఠినంగా శిక్షించాలి

– ప్రభుత్వం విద్యార్థినులకు ఎక్స్ గ్రేషియా ప్రకటించి ఇవ్వాలి

బిఎస్పి నకిరేకల్ నియోజకవర్గ ఇంచార్జి మేడి ప్రియదర్శిని



భువనగిరి టౌన్, ఫిబ్రవరి 07(తీన్మార్ న్యూస్): పట్టణంలో దారుణంగా బీచ్ మహిళ పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న కోడి భవ్య (15), గాదె వైష్ణవి(15) అనే ఇద్దరు విద్యార్థునులు హాస్టల్లో ఉరేసుకొని శనివారం రాత్రి ఆత్మహత్యకు పాల్పడ్డారని ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షించాలని బిఎస్పి నకిరేకల్ నియోజకవర్గ ఇంచార్జి మేడి ప్రియదర్శిని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మేడి ప్రియదర్శిని మాట్లాడుతూ సాయి కృప డిగ్రీ కళాశాల ఆవరణలో ఉన్న ఎస్సీ హాస్టల్ లో ఈ ఘటన చోటు చేసుకుందని విద్యార్థినులను కౌన్సెలింగ్ పేరుతో పిఈటి, వార్డెన్, ఆటో డ్రైవర్లు కలిసి నిబంధనలకు విరుద్ధంగా విచారణ చేసినారని అన్నారు. కనీసం విద్యార్థినుల తల్లిదండ్రులకు తెలియజేయలేదని ఈ ఘటన వారం రోజులుగా జరుగుతున్నప్పటికీ పై అధికారుల దృష్టికి సైతం తీసుకెళ్లలేదని అన్నారు. కౌన్సిలింగ్ పేరుతో విద్యార్థులు మనస్థాపానికి గురయ్యారని అన్నారు. జిల్లా కలెక్టర్ అధికారులు స్పందించకపోవడం కనీసం కుటుంబాలను పరామర్శించకపోవడం అన్యాయమని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ద్వారా కుటుంబాలను పూర్తిగా ఆదుకుని ఎక్స్రేషియా చెల్లించాలని అలాగే ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం కఠినమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## అయోధ్యపై బ్యాంకుల ఫోకస్.. సేవల విస్తరణకు క్యూ

రామ మందిరం ప్రారంభోత్సవ నేపథ్యంలో బ్యాంకుల వ్యాపార కార్యకలా పాలు ఊపందుకున్నాయి. దీంతో వాణిజ్య బ్యాంకులు తమ కార్యకలాపా లను విస్తరించాలని చూస్తున్నాయి. హెచ్‌డీఎఫ్‌సీ నుంచి కర్ణాటక బ్యాంకు వరకు దాదాపు అన్ని బ్యాంకులు తమ శాఖల్ని పెంచాలని నిర్ణయిం చాయి.దేశంలో అతిపెద్ద ప్రైవేటు రంగ బ్యాంక్ అయిన హెచ్‌డీఎఫ్‌సీకి ఇప్పటికే అయోధ్యలో మూడు బ్రాంచ్‌లు ఉన్నాయి. మార్చి చివరికి మరో కొత్త బ్రాంచిని తెరవాలని చూస్తోంది. గత వారంలోనే కర్ణాటక బ్యాంక్ తన 915 శాఖను అయోధ్యలో ప్రారంభించింది. ఇక యాక్సిస్ బ్యాంక్ మొబైల్ ఏటీఎంలను తీసుకురావడం ద్వారా ఏటీఎంల సంఖ్యను పెంచుతున్నట్లు తెలిపింది. వ్యాపార అవకాశాల దృష్ట్యా కొత్త బ్రాంచిని తెరిచే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు జమ్ము అండ్ కశ్మీర్ బ్యాంక్ తెలిపింది. 2019 నవంబరులో సుప్రీంకోర్టు తీర్పుతో రామమందిర నిర్మాణం ప్రారంభమైంది. జనవరి 22న విగ్రహ ప్రాణప్రతిష్ఠ కార్యక్రమం జరగనుంది. తీర్పు వెలువడినప్పటి నుంచి అయోధ్యలో వ్యాపార కార్యకలాపాలు జోరందుకున్నాయి. గత నెలలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ మహర్షి వాల్మీకి అంతర్జాతీయ విమానాశ్రయాన్ని ప్రారంభించారు. సరయూ నదీ తీరం పర్యాటక ప్రదేశంగా రూపుదిద్దుకుంది.

## తహశీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేసిన ఆర్డీఓ



రాజాపేట, ఫిబ్రవరి 07 (తీన్మార్ న్యూస్): రాజాపేట మండల తహశీల్దార్ కార్యాలయాన్ని బుధవారం భువనగిరి ఆర్డీఓ అమరేందర్ తనికి చేసి కార్యాలయంలోని రికార్డులను పరిశీలించారు. ఈనెల 15 వరకు జరిగే పారిశుద్ధ్య వారోత్సవాల్లో భాగంగా పాల్గొని, మండలంలో జరిగే సమ్మక్క సరక్క జాతర ఏర్పాట్లపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ దామోదర్ యాదవ్, ఎంపీడీవో జ్ఞాన ప్రకాష్, గుట్ట రూరల్ సీఐ వేణుగోపాల్, ఎస్ఐ సుధాకర్ రెడ్డి, ఆర్ఐ రమేష్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## సీఐ వేణుగోపాల్ ని సన్మానించిన నాయకులు, జర్నలిస్టులు





రాజాపేట, ఫిబ్రవరి 07(తీన్మార్ న్యూస్): యాదగిరిగుట్ట రూరల్ నూతన సీఐ గా బాధ్యతలు చేపట్టి మొదటిసారి రాజపేట పోలీస్ స్టేషన్ కు వచ్చిన సీఐ వేణుగోపాల్ ను పలువురు నాయకులు, జర్నలిస్టులు ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ సుధాకర్ రెడ్డి రాష్ట్ర రజక సంఘం నాయకులు సట్టు తిరుమలేష్, మాజీ సర్పంచ్ గుంటి మధుసూదన్ రెడ్డి, ఎర్ర గోగుల రాజు, జర్నలిస్టులు జిల్లా ప్రతినిధి టీజేయు మండల అధ్యక్షులు మహమ్మద్ యూసుఫ్, నిజం దిన పత్రిక జర్నలిస్టు మీసా వెంకటేశం లు పాల్గొన్నారు.

## టూరిజంలో బొల్లారం సంజీవ కి డాక్టరేట్



హన్మకొండ, ఫిబ్రవరి 07(తీన్మార్ న్యూస్): కాకతీయ విశ్వవిద్యాలయంలో టూరిజం విభాగానికి చెందిన బొల్లారం సంజీవ కి టూరిజంలో డాక్టరేట్ ప్రకటించినట్టు పరీక్షల నియంత్రణ అధికారి పి.మల్లారెడ్డి తెలిపారు. హన్మకొండ జిల్లా, పరకాల మండలం, మళ్ళక్కపేట గ్రామానికి చెందిన సంజీవ పుట్టుకతోనే అంగవైకల్యం కలిగి ఉండటంతో అనేక ఇబ్బందులు పడ్డారు. అయినప్పటికీ కుంగిపోకుండా చిన్నప్పటి నుంచి ఎంతో కష్టపడి చదివి అంగవైకల్యాంన్నీ సైతం జయించి మళ్ళక్కపేట గ్రామంలోనే మొదటి డాక్టరేట్ పట్టా సాధించాడు. విశ్రాంత ఆచార్యులు, తక్కాలాపల్లి దయాకర్ రావు పర్యవేక్షణలో "ఇంపాక్ట్ ఆఫ్ టూరిజం ఆన్ సోసిఓ-ఎకనామిక్ డెవలప్మెంట్ ఇన్ ఏ స్టడీ ఆఫ్ నార్త్ తెలంగాణ"అనే అంశంపై జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పబ్లికేషన్స్ చేశారు. డాక్టరేట్ సాధించిన బొల్లారం సంజీవ ని ఈ సందర్భంగా పలువురు బోధన, బోధనేతర సిబ్బంది, తోటి పరిశో ధకులు, స్నేహితులు, గ్రామస్థులు, అభినందించారు.

## ఉద్యమాన్ని నీరుగార్చేందుకే ఎస్మా ప్రయోగం

పుట్టపర్తి : ప్రభుత్వం ప్రయోగించిన ఎస్మా చట్టం ప్రధాన ఉద్దేశం.. సమ్మె విరమించాలన్నదేనని ఏపీ అంగన్‌వాడీ, ఆయా వర్కర్ల యూనియన్ ఆరోపించింది. అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మెను నిషేధిస్తూ ప్రభుత్వం సంజాయిషీ కోరుతూ ఈనెల 6న నోటీసులు ఇస్తూ ఉత్తర్వులు జారీ చేసిన క్రమంలో అంగన్‌వాడీలు తమ అభిప్రాయాన్ని తెలుపుతూ పుట్టపర్తిలోని సీడీపీవో కార్యాలయం వరకు నిరసన ప్రదర్శన నిర్వహించారు. సీడీపీవో గాయత్రికి సంజాయిషీ ప్రతులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం సమ్మె నిషేధిస్తూ జారీ చేసిన నోటీసులు అంగన్‌వాడీ కార్యకర్తలకు వ్యక్తిగతంగా ఇవ్వలేదని, ఉమ్మడిగా మీరు అని సంబోధించడంతో నోటీసుకు అర్థం లేకుండా పోయిందన్నారు. ప్రభుత్వం చెబుతున్నట్లు తాము గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం అందించలేదన్న నెపాన్ని తోసిపుచ్చారు. ప్రభుత్వం తన లోపాలను కప్పిపుచ్చుకొనేందుకే తమపై ఆరోపణలు చేస్తోందని వాపోయారు. ప్రభుత్వం డిమాండ్లు తీరుస్తేనే సమ్మె విరమించి విధుల్లో చేరతామని స్పష్టం చేశారు.

# ఐఎన్ టీయూసి వనపర్తి జిల్లా అధ్యక్షుడిగా గంగు మాధవరెడ్డి



పెబ్బేరు, ఫిబ్రవరి 07(తీన్మార్ న్యూస్): వనపర్తి జిల్లా, కొత్తకోట గ్రామానికి చెందిన గంగు మాధవరెడ్డిని ఐఎన్టీయూసి వనపర్తి జిల్లా అధ్యక్షుడిగా నియమిస్తూ తెలంగాణ ఐఎన్ టీయూసి రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ మురహరి బుద్దారం హైదరాబాద్ లో రాష్ట్ర కార్యాలయంలో బుధవారం నియామక పత్రం అందజేశారు. అదేవిధంగా బుదవారం జాతీయ ఐఎన్ టీయూసి అధ్యక్షులు స్వామినాత్ జైస్వాల్ పుట్టినరోజు వేడుకలు తెలంగాణ రాష్ట్ర కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్ష పదవి స్వీకరించటం సంతోషంగా ఉ ందని మాధవరెడ్డి అన్నారు. గత పది సంవత్సరాలుగా అనేక మంది చైల్డ్ ను రక్షించటంలో పాత్ర పోషించిన అనుభవం ఇప్పుడు కలిసి వచ్చే అంశం అని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మాజీ అధ్యక్షులు సాయిబాబా, రాష్ట్ర ఉపాధ్యక్షులు బోరింగ్ శ్రీనివాసులు, ప్రశాంత్ రెడ్డి, నాగర్ కర్నూల్ జిల్లా అధ్యక్షులు లక్ష్మణ్, మహిళా విభాగం అధ్యక్షులు శరణ్యా రెడ్డి, నర్మదా రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# డాక్టర్ బ్రహ్మారెడ్డి మల్టీస్పెషల్టి ప్రజా

## వైద్యశాలలో మెరుగైన వైద్యం






**– ఆపరేషన్ కోత లేకుండా 1.5 ఎం ఎం 2.2 ఎం ఎం మరియు 19 ఎం ఎం రాళ్లను కిడ్నీలో నుంచి తొలగించిన వైద్యులు**


వనపర్తి టౌన్, ఫిబ్రవరి 07(తీన్మార్ న్యూస్): పెబ్బేర్ లో బ్రహ్మా రెడ్డీ హాస్పటల్ నందు కె.నడిపేన్న వయసు 50 సంవత్సరాల వ్యక్తి కి చాలాకాలం గా మలవిసర్జన (మూత్రం) అతి కష్టంగా వస్తున్నందున డాక్టర్ బ్రహ్మారెడ్డి మల్టీ స్పెషాలిటీ ప్రజా వైద్యశాలను సందర్శించారు. వైద్యులు స్కానింగ్ ద్వారా కిడ్నీలోని రాళ్లు ఉన్నాయని నిర్ధారించారు. ఎలాంటి కోత లేకుండా వైద్యులు ఆధునిక పరికరాలను ఉపయోగించి కిడ్నీలో నుంచి మూడు రాళ్ళను 1.5 ఎంఎం 2.2 ఎం ఎం మరియు 19 ఎం ఎం రాళ్లను కిడ్నీలో నుంచి తొలగించారు. ఇట్టి ఆపరేషన్ విజయవంతంగా పూర్తి అయినందువలన పేషెంట్ మరియు వారి కుటుంబ సభ్యులు డాక్టర్లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# మరో కొత్త డిపాజిట్ స్కీమ్ లాంచ్ చేసిన బీఓబీ.. నమ్మలేని వడ్డీ రేటు మీ సొంతం




కష్టపడి సంపాదించిన సొమ్ముకు మంచి రాబడి కోసం వివిధ పెట్టుబడి పథకాల్లో పెట్టుబడి పెడుతూ ఉంటారు. ఇలాంటి పథకాల్లో ఫిక్స్డ్ డిపాజిట్లు ఎక్కువ ప్రజాదరణ పొందాయి. 2022 నుంచి ఆర్బీఐ తీసుకుంటున్న చర్యల కారణంగా అన్ని బ్యాంకులు ఎఫ్డీలపై వడ్డీ రేట్లను పెంచాయి. అయితే గత నాలుగు త్రైమాసికాల నుంచి ఆర్బీఐ రెపో రేటునుయథాతథంగా ఉ ంచడంతో వడ్డీ రేట్ల పెంపునకు బ్రేక్ పడింది.కొన్ని రకాల బ్యాంకులు మాత్రం వినియోగదారులకు ఆకట్టుకో వడానికి ప్రత్యేక వడ్డీ రేట్లు అందిస్తున్నాయి. తాజాగా బ్యాంక్ ఆఫ్ బరోడా బాబ్ 360 డిపాజిట్ స్కీమ్ను ప్రారంభించింది. ఇది 360 రోజులకు సంవత్సరానికి వర్తిస్తుంది. బ్యాంక్ ఆఫ్ బరోడా తీసుకొచ్చిన కొత్త పథకం గురించి వివరాలను తెలుసుకుందాం. బ్యాంక్ ఆఫ్ బరోడా తీసుకొచ్చిన 360 డిపాజిట్ స్కీమ్ 7.60 శాతం వరకు వడ్డీ రేట్లను అందిస్తుంది. ఈ ప్రత్యేక స్వల్పకాలిక రిటైల్ డిపాజిట్ స్కీమ్ ఇందులో సీనియర్ సిటిజన్లకు సంవత్సరానికి 0.50 శాతం ఉంటుంది.ముఖ్యంగా ఈ డిపాజిట్లు రూ.2 కోట్ల వరకూ ఈ వడ్డీ రేటు వర్తిస్తుంది. బ్యాంక్ ఆఫ్ బరోడా తాజా చర్యలు బ్యాంకు స్వల్పకాలిక రిటైల్ టర్మ్ డిపాజిట్లలో వాటాను పెంచడానికి,. దాని డిపాజిట్ల వ్యయాన్ని సమర్థవంతంగా నిర్వహించడానికి సాయం చేస్తుందని నిపుణుల వాదన. బ్యాంక్ ఆఫ్ బరోడాకు సంబంధించిన ప్రస్తుత, కొత్త కస్టమర్లు భారతదేశంలోని ఏదైనా బ్యాంకు శాఖల ద్వారా బాబ్ 360ని తెరవవచ్చు. అదే సమయంలో బ్యాంక్ నెట్ బ్యాంకింగ్ (బాబ్ వరల్డ్ ఇంటర్నెట్) ప్లాట్ఫారమ్ ద్వారా ఆన్లైన్ ఎఫ్డీను కూడా తెరవవచ్చు. ఇప్పటికే ఉన్న కస్టమర్లు మొబైల్ యాప్ (బాబ్ వరల్డ్) ద్వారా ఆన్లైన్ ఎఫ్డీని కూడా తెరవవచ్చని బ్యాంక్ ఆఫ్ బరోడా తెలిపింది. గత నెలలో బ్యాంక్ ఆఫ్ బరోడా రుణదాత దేశీయ రిటైల్ టర్మ్ డిపాజిట్లపై వడ్డీ రేట్లను ఎన్ఆర్ఓ టర్మ్ డిపాజిట్లతో సహా వివిధ మెచ్యూరిటీ బకెట్లపై 10 బేసిస్ పాయింట్ల నుంచి 125 బేసిస్ పాయింట్ల వరకు పెంచుతున్నట్లు ప్రకటించింది. ఏడు రోజుల నుంచి 14 రోజుల మధ్య మెచ్యూరయ్యే రిటైల్ టర్మ్ డిపాజిట్ల కోసం, బ్యాంక్ ఆఫ్ బరోడా 4.25 శాతం నుంచి వడ్డీ రేట్లను అందిస్తుంది. ఏడు రోజుల నుంచి 14 రోజుల వరకూ సాధారణ ప్రజలకు 4.25 శాతం, సీనియర్ సిటిజన్లకు 4.75శాతం వడ్డీ రేటును అందిస్తుంది. 15 రోజుల నుంచి 45 రోజుల వరకూ 4.50 శాతం, 5.00 శాతం అందిస్తారు. 46 రోజుల నుంచి 90 రోజుల వరకూ సాధారణ ప్రజలకు 5.50 శాతం, 6 శాతం వడ్డీ రేటును అందిస్తున్నారు. 91 రోజుల నుంచి 180 రోజుల వరకూ 5.60 శాతం, 6.10 శాతం వడ్డీ రేటును అందిస్తుంది. 181 రోజుల నుంచి 210 రోజుల వరకూ 5.75 శాతం నుంచి 6.25 శాతం వడ్డీను అందిస్తుంది 211 రోజుల నుంచి 270 రోజుల వరకూ 6.15 శాతం నుంచి 6.65 శాతం వరకూ వడ్డీ రేటును అందిస్తుంది. 271 రోజుల నుంచి సంవత్సరం కంటే తక్కువ వ్యవధికి 6.25 శాతం నుంచి 6.75 శాతం వడ్డీ రేటును అందిస్తుంది.

# టీసీఎస్ కీలక నిర్ణయం.. 5 లక్షల మందికి ట్రైనింగ్!




2023 ప్రారంభం నుంచి టెక్ ఉద్యోగులు ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కోవాల్సి వచ్చింది. ఈ ఏడాది (2024) ప్రారంభంలో కూడా కొన్ని దిగ్గజ కంపెనీలు తమ ఉద్యోగులను తొలగించగా.. టీసీఎస్ మాత్రం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) మీద ఏకంగా ఐదు లక్షల మంది సాఫ్ట్వేర్ ఇంజనీర్లకు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిసింది. దీనికి సంబంధించిన మరిన్ని వివరాలు ఇక్కడ తెలుసుకుందాం. భారతీయ టెక్ దిగ్గజం టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్.. పరిశ్రమలలో విప్లవాత్మక మార్పులు తీసుకురావడానికి ప్రారంభ దశలో ఉన్న ఐదు లక్షలమందికి ట్రైనింగ్ ఇవ్వడానికి సంకల్పించింది. రాబోయే రోజుల్లో కృత్రిమ మేధను ఉపయోగించుకోవాల్సి వస్తుందని, అప్పటికి అందులో శిక్షణ పొందిన ఉద్యోగుల అవసరం కంపెనీకి ఉంటుందని %ఐజూ% ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. వర్క్ఫోర్స్ ట్రైనింగ్ అండ్ స్ట్రాటజిక్ పార్టనర్షిప్లు అనే రెండు కీలక రంగాలలో పెట్టుబడి పెట్టడం ద్వారా భవిష్యత్తు కోసం చురుకుగా సిద్ధమవుతోందని కంపెనీ %గూ×.జశ్రీశీబ%ు యూనిట్ హెడ్ శివ గణేశన్ తెలిపారు. ఏఐ మీద శిక్షణ ఇవ్వడానికి కంపెనీ అత్యధునిక సాంకేతికతలను ఉ పయోగించనున్నట్లు సమాచారం. అయితే ట్రైనింగ్ ఎప్పటి నుంచి ప్రారంభించనుంది, ఎప్పటికి పూర్తి చేయనుందనే విషయాలను వెల్లడించలేదు. కానీ గతంలో టీసీఎస్ కంపెనీ 150,000 మందికి ఏఐలో శిక్షణ ఇవ్వడానికి ఏడు నెలల సమయం తీసుకుంది. దీన్ని బట్టి చూస్తే రాబోయే రోజులో ఐదు లక్షల మందికి ఎన్ని రోజుల్లో శిక్షణ ఇస్తుందనేది అంచనా వేసుకోవచ్చు. ఏఐ టెక్నాలజీ ద్వారా ఉ ద్యోగాలు పోతాయని చాలా కంపెనీల సీఈఓలు గతంలో వెల్లడించారు, కానీ ఈ టెక్నాలజీని సరిగ్గా ఉపయోగించుకోవడానికి మానవ ప్రమేయం అవసరమని, తద్వారా కొత్త ఉద్యోగాలు పుట్టుకొస్తాయని కొందరు భావించారు. ప్రస్తుతం ఆ భావనే నిజమవుతోంది. పరిస్థితులు చూస్తుంటే రానున్న రోజుల్లో మరిన్ని టెక్ కంపెనీలు ఈ ఏఐపైన ఉ ద్యోగులకు ట్రైనింగ్ ఇచ్చే అవకాశాలు ఉన్నట్లు స్పష్టమవుతోంది.

# భద్రతా నిబంధనలపై ప్రజలకు అవగాహన

## మంచిర్యాల కలెక్టర్ బదావత్ సంతోష్



నస్పూర్, : రోడ్డు భద్రతా నిబంధనలపై ప్రజలకు అవగాహన కల్పించడం జరగుతుందని మంచిర్యాల కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. నస్పూర్లోని కలెక్టరేట్లో జిల్లా రవాణా శాఖ అధికారి కిష్టయ్యతో కలిసి 37వ జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల బ్యానర్లు, వాల్ పోస్టర్లు, స్టిక్కర్లను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఫిబ్రవరి 14వ తేదీ వరకు జిల్లాలో రోడ్డు భద్రతా మాసోత్సవా లు నిర్వహిస్తామన్నారు. ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటిస్తూ సురక్షిత ప్రయా ణం చేయాలని కోరారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు. స్పష్టమైన ఫొటో ఓటరు జాబితా రూపకల్పనలో భాగంగా నూతన ఓటరు నమో దు, ఓటరు జాబితా సవరణ, మార్పు లు, తొలగింపుల కోసం జిల్లాలో ఈ నెల 20, 21 తేదీల్లో ప్రత్యేక ఓటరు నమో దు, సవరణ శిబిరాలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ బదావత్ సంతోష్ ఒక ప్రకటనలో తెలిపారు. 18 ఏండ్లు నిండిన వారందరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. నమోదు, సవరణ, తొలగింపుల కోసం దరఖాస్తు చేసుకునేందుకు అవసరమైన 6,7,8 పారాలు బూత్ స్థాయి అధికారుల వద్ద అందు బాటులో ఉంటాయని తెలిపారు. పాలనలో ఉత్తమప్రతిభ చూపిన ప్రభు త్వ ఉద్యోగుల(సివిల్ సర్వెంట్స్)కు అందించేందుకు ప్రధానమంత్రి పురస్కారాల కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు కలెక్టర్ సంతోష్ తెలిపారు. న్యూఢిల్లీ నుంచి కేంద్ర పరిపాలనా సంస్కరణలు, ప్రజా ఫిర్యాదుల విభాగం సంయుక్త కా ర్యదర్శి నిర్వహించిన వీడియోకా న్ఫరెన్స్లో నస్పూర్లోని కలెక్టరేట్ కార్యాల యం నుంచి బుధవారం ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ క్యాటగిరి 1లో 12 ప్రాధాన్యతల కింద ఉత్తమప్రతిభ చూపిన వారికి 10 అవార్డులు, క్యాటగిరి 2 కేంద్ర, రాష్ట్ర జి ల్లాల వారీగా ఆవిష్కరణల విభాగంలో ఉత్తమ సేవలందించిన వారికి 6 అవార్డు లు అందిస్తారని తెలిపారు. ఏప్రిల్ 1, 2021 నుంచి జనవరి 31, 2024 మధ్యకాలంలో చేసిన సేవలకు ఈ పురస్కారాలు అందిస్తారని తెలిపారు. ఆన్లైన్లో దరఖాస్తుల స్వీకరణ ఉంటుందని, 5 దశలలో పరిశీలన జరుగుతుందని తెలిపా రు. తుది దశలో పురస్కార గ్రహీతలను ప్రధానమంత్రి ఆమోదిస్తారని, ఈ నెల 31లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

## మహిళా సంఘాల ఆధ్వర్యంలో

# నూనె తయారీ కేంద్రం



సిర్పూర్(యు) : మండల కేం ద్రంలోని ఐకేపీ స్త్రీనిధి భవనంలో మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మంచి నూనె తయారీ కేంద్రాన్ని ఎమ్మెల్యే కోవ లక్ష్మి, అదనపు కలెక్టర్ దీపక్ తివారీ బుధవారం ప్రారంభించారు. మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఐటీడీఏ ద్వారా రూ. 18 లక్షల తో ఈ నూనె తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొ న్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు ఈ మిల్లు దోహ దం చేస్తుందన్నారు. ఇప్ప పరక నూనెతో పాటు వేరుశనగ, నువ్వుల నూనె తయారు చేస్తారని తెలిపారు. 200 గ్రాముల నూనె ధర రూ.150, లీటరు నూనె ధర రూ. 750 ఉం టుందని ఏపీఎం వెంకట రెడ్డి తెలిపారు. సొం త నూనె ధాన్యాలు తీసుకువస్తే కిలోకు రూ. 30 తీసుకుంటామన్నారు. 10 కిలోల ధాన్యాలకు 3.5 లీటర్ల నూనె వస్తుందని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ తొడసం భాగ్యలక్ష్మి, వైస్ ఎంపీపీ ఆత్రం ప్రకాశ్, సింగిల్ విండో చైర్మన్ కేంద్రె శివాజీ, బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు తొడసం ధర్మరావ్, సర్పంచులు ఆత్రం వీణాబాయి, పెందోర్ నాగోరావ్, ఎంపీటీసీ గేడాం సార్జాబాయి, ఎంపీడీవో మధుసూదన్, డీఆర్డీవో సురేందర్ ఉన్నారు.

# కేసీఆర్ సర్కారు నిధులతోనే అభివృద్ధి పనులు


## మంచిర్యాల

## మాజీ ఎమ్మెల్యే దివాకర్రావు



మంచిర్యాల : కేసీఆర్ సర్కారు విడుదల చేసిన నిధులతోనే మంచిర్యాల పట్టణంలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని మాజీ ఎమ్మెల్యే నడిపె ల్లి దివాకర్రావు అన్నారు. పట్టణంలోని సున్నంబట్టి వాడలో జాతీయ రహదారి నిర్మాణ పనులను బీఆర్ఎస్ నాయకులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే దివాకర్రావు మాట్లాడు తూ గత ప్రభుత్వంలో ఆనాటి సీఎం కేసీఆర్ నాయకత్వంలో తాను ఎమ్మెల్యే ఉన్నప్పుడు మంజూరు చేయించిన అభివృద్ధి పనుల్లో భాగంగా పాత మంచిర్యాల నుంచి ఓవర్ బ్రిడ్జి వరకు రూ.12.39 కోట్లతో రోడ్డుకి ఇరువైపులా వెడల్పు, డివైడర్, సెంట్రల్ లైటింగ్ పనులు జరుగుతున్నాయన్నారు. ఓవర్ బ్రిడ్జి నుంచి తోళ్లవాగు వరకు రూ.15.14 కోట్లతో రోడ్డు వెడల్పు, సెంట్రల్ లైటింగ్, రోడ్డు కి ఇరువై పులా డ్రైన్, ఓవర్బ్రిడ్జి పైన హైపర్పాలిస్టర్ షీట్తో డాంబర్ రోడ్ వేయడం జరుగుతుందన్నారు. తోళ్లవాగు నుంచి రసూలుపల్లె వరకు రూ. 59.79 కోట్లతో సెంట్రల్ లైటింగ్ ,రోడ్డు వెడల్పు, ఫారెస్ట్ క్లియరెన్స్ మినహా దాదాపు పనులు పూర్తయినట్లు తెలిపారు. ఐబీ నుంచి బెల్లంపెల్లి వరకు రూ.14. 28కోట్లతో పాత ఆర్అండ్బీ రోడ్ని బాగు చేయడం, ఐబీ నుంచి శ్రీనివాస గార్డెన్ వరకు రూ.35 కోట్లతో డ్రైన్, డివైడర్, సెంట్రల్ లైటింగ్లకు టెండర్ ప్రక్రియ పూర్తయిందని, త్వరలో పనులు ప్రారంభమవుతాయని తెలిపారు. ఇలా జిల్లా కేంద్రంలో రూ. 136.60కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని దివాకర్ రావు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు సుదమల్ల హరికృష్ణ, గాదె సత్యం, బోరిగాం శ్రీనివాస్, బీఆర్ఎస్ నాయకులు గోగుల రవీందర్రెడ్డి, పడాల రామన్న, పడాల రవీందర్, చంద్రశేఖర్ హండే, బగ్గని రవి, శ్రీపతి వాసు, తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ప్రభుత్వంతో రాష్ట్ర ప్రజలకు స్వేచ్ఛ



వేములవాడ : రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటుతో రాష్ట్ర ప్రజలకు స్వేచ్ఛ వచ్చిందని, ఈ గెలుపును ప్రజలు తమ గెలుపుగా భావిస్తున్నారని తెలంగాణ జన సమితి అధ్యక్షుడు ఆచార్య కోదండరాం పేర్కొన్నారు. వేములవాడ పట్టణంలో ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్కు పౌర సన్మాన కార్యక్రమాన్ని పట్టణ ప్రముఖులు ఘనంగా నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ పట్టణంలో ప్రజా సంఘాలు, ప్రముఖులు కలిసి ఆది శ్రీనివాస్కు పౌర సన్మానం చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. వేములవా డలో బలమైన శక్తులను తట్టుకొని నిలబడటం ఒక గొప్ప ధైర్యమన్నారు. ప్రత్యర్థులు ఎన్ని కుట్రలు పన్నినా పేదల నాయకుడు, ప్రశ్నించే గొంతుకైన ఆది శ్రీనివాస్కు పట్టం కట్టారని ఆయన అభిప్రాయపడ్డారు. రాష్ట్ర అభివృద్ధి పేర గత ప్రభుత్వం రూ.6 లక్షల కోట్లకు పైగా అప్పులు చేసిందని, తీరా చూస్తే రాష్ట్రం అంతటా సమస్యలే మిగిలాయని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటుతో ఇప్పుడే తెలంగాణ వచ్చిందని ప్రజలు భావిస్తున్నారని, ప్రజల భుజాలపై బరువు దిగిపోయిందని పేర్కొన్నారు. మొన్న గెలుపు తెలంగాణ ప్రజల విజయమని పేర్కొన్నారు. ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ గతంలో ప్రజా సమస్యలపై అలుపెరుగని పోరాటం చేసిన వాడిగా తనను ఆదరించిన ప్రజలకు ఎళ్లవేళలా సేవలందిస్తానని చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో ఈ ప్రాంతం అభివృద్ధిలో పూర్తిగా వెనుకబడిందని తెలిపారు. రాజన్న ఆలయ అభివృద్ధికి ఏటా రూ. వంద కోట్లు ఇస్తామని ప్రకటించి ఇవ్వలేదని, గుడి చెరువు అభివృద్ధి జరగలేదని, వంతెన నిర్మాణం పూర్తి కాలేదని విమర్శించారు. వేములవా డను ప్రముఖ పర్యాటక కేందంగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని చెప్పారు.వేములవాడలో బలమైన శక్తులను తట్టుకొని నిలబడటం ఒక గొప్ప ధైర్యమన్నారు. ప్రత్యర్థులు ఎన్ని కుట్రలు పన్నినా పేదల నాయకుడు, ప్రశ్నించే గొంతుకైన ఆది శ్రీనివాస్కు పట్టం కట్టారని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా కోదండరాం, ఆది శ్రీనివా స్లను గజమాలతో ఘనంగా సత్కరించి రాజన్న చిత్రపటం అందజేశా రు. కార్యక్రమంలో సభాధ్యక్షుడు తిరుమల్గౌడ్, జన సమితి జిల్లా అధ్యక్షుడు బొజ్జ కనకయ్య, పంజాల వెంకటేశ్వర్లు, బుస్స శ్రీనివాస్, దశరథం, బాశెట్టి రవీందర్, నగుబోతు రవీందర్, తడగొండ సత్తయ్య, దుర్మట్ల హారిక, పెంట రాజు, అంజయ్య, రమేశ్, మహేశ్, పోశెట్టి, సత్యనారాయణ, కౌన్సిలర్ బింగి మహేశ్, స్థానిక నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


# అక్షర ప్రగతికి పంచ సూత్రాలు



పెద్దపల్లి కలెక్టరేట్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల గైర్హాజరు శాతం పెరుగుతుండటం ఉత్తీర్ణతపై ప్రభావం చూపుతోంది. ఈ క్రమంలో సర్కారు బోధనను మెరుగుపరచడంపై కలెక్టర్ ముజామిల్‌ఖాన్ ప్రత్యేక దృష్టి సారించారు. పిల్లల్లో కనీస సామర్థ్యాలు పెంచేందుకు పంచ సూత్రాల కార్యక్రమం ప్రారంభించారు. కిచెన్ గార్డెన్, విద్యార్థుల ప్రతిభను లేఖల ద్వారా తల్లిదండ్రులకు పంపుతుండటం వంటి కార్యక్రమాలు సత్ఫలితాలిస్తున్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల అభ్యసన సామర్థ్యాల ఆధారంగా మూడు విభాగాలుగా విభజిస్తున్నారు. వీటి ఆధారంగా పిల్లలు నల్లబల్లపై రాయించడం, ధారాళంగా చదివించడం, చదివిన పాఠాన్ని గుర్తుంచుకునేలా చేయడానికి ఉపాధ్యాయులు యత్నిస్తున్నారు. పాఠ్యాంశాలపై పట్టు పెంచే దిశగా బోధిస్తున్నారు. తొలిమెట్టు, ఉన్నతి, లక్ష్య కార్యక్రమాలతో పాటు వీటిని పకడ్బందీగా అమలు చేస్తుండటంతో పిల్లల్లో సామర్థ్యాలు పెరుగుతున్నాయి. ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులను భాగస్వాములను చేస్తూ 'పంచసూత్రాల' కార్యక్రమం కొనసాగుతోంది. ఇందులో విద్యార్థులు, ఉపాధ్యాయులు రెండేసి, తల్లిదండ్రులకు ఒక దాంట్లో భాగస్వాములుగా ఉంటారు. హాజరు కావడంతో పాటు పిల్లల మానసిక, వ్యక్తిత్వం ఆధారంగా అర్థమయ్యేలా బోధించాలి. పాఠశాలల్లో కృత్యాధార బోధన, విద్యార్థులు పాఠ్యాంశాలపై పట్టు సాధించడం తదితర అంశాలను తల్లిదండ్రులు కచ్చితంగా వీడియోల ద్వారా వీక్షించి సందేహాలు నివృత్తి చేసుకోవాల్సి ఉంటుంది. బోధన తీరు.. పిల్లలు ఎలా నేర్చుకుంటున్నారు? నల్లబల్లపై సాధన తదితర అంశాలను ఉపాధ్యాయులు వీడియోలో చిత్రీకరిస్తున్నారు. తరగతి వారీగా తల్లిదండ్రుల వాట్సాప్ గ్రూప్‌నకు పంపిస్తున్నారు. పాఠాలు బోధిస్తుంటే పిల్లల స్పందన ఎలా ఉంటోంది? అర్థం చేసుకుంటున్నారా..! అనే విషయం తల్లిదండ్రులు తెలుసుకునేందుకు ఈ విధానం దోహదపడుతుంది. ప్రతి నెల మూడో శనివారం నిర్వహించే తల్లిదండ్రుల సమావేశంలో వీడియోలను డిజిటల్ తెరపై ప్రదర్శిస్తున్నారు. పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు జిల్లా స్థాయి అధికారులను మండలాలకు ఇన్‌ఛార్జులుగా నియమించారు. పాఠశాలల్లో ఉదయం, సాయంత్రం జరిగే ప్రత్యేక తరగతులను వారానికి రెండు సార్లు సందర్శిస్తున్నారు. నిశితంగా పరిశీలించి కలెక్టర్‌కు నివేదిస్తున్నారు. జిల్లా స్థాయిలో పాఠశాల వారీగా సమీక్షిస్తున్నారు. పదో తరగతి ఫలితాల ప్రాధాన్యంపై తల్లిదండ్రులకు లేఖలు రాస్తున్నారు. పాఠ్యాంశాలపై సాధన, స్టడీమెటీరియల్ పంపిణీ, వెనుకబడిన వారి దత్తత, సిలబస్ పూర్తి చేయడం, ఇంటి వద్ద తల్లిదండ్రుల పర్యవేక్షణ అంశాలపై లేఖలో వివరిస్తున్నారు.

## గ్రామ పంచాయతీల్లో ప్రత్యేకాధికారుల

# పాలన దిశగా అడుగులు ?



కైలాస్‌నగర్: గ్రామ పంచాయతీల్లో ప్రత్యేక పాలన దిశగా అడుగులు పడుతుం ప్రస్తుత పాలకవర్గాల గడువు ఈ ఏడాది ఫిబ్రవరి 2వ తేదీతో ముగి యనుంది. ఆలోగా ఎన్నికల నిర్వహణ ప్రక్రియ పూ ర్తి చేయాల్సి ఉండగా రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటి వర కు ఎలాంటి ఏర్పాట్లు చేపట్టకపోవడం గమనార్హం. పార్లమెంట్ ఎన్నికలు ముగిసే వరకు పంచాయతీ ఎన్నికలను నిర్వహించే అవకాశం లేకపోవడంతో ప్రత్యేకాధికారులను నియమించేందుకు యోచిస్తున్నట్లుగా తెలుస్తోంది. అధికారికంగా ఎలాంటి ఉత్తర్వులు అందనప్పటికీ అప్పటికప్పుడు ఇబ్బందులు పడకుండా ఉండేలా జిల్లా పంచాయతీ అధికారులు అంతర్గతంగా ఎన్నికలకు సంబంధం లేనటువంటి మండల స్థాయి అధికారుల వివరాలు సేకరించే పనిలో నిమగ్నమైనట్లుగా తెలుస్తోంది. జిల్లాలో 468 గ్రామ పంచాయతీలుండగా, 3,830 వార్డు సభ్యుల స్థానాలున్నాయి. 2019లో వీటికి మూడు విడతలుగా ఎలక్షన్ కమిషన్ ఎన్నికలు నిర్వహించింది. ఇందులో గెలుపొందిన సర్పంచ్‌లు ఫి బ్రవరి 2న బాధ్యతలు స్వీకరించారు. మరో 16 రో జుల్లో వీరి పదవీకాలం ముగియనుంది. అయితే ఇప్పటి వరకు ఎలాంటి ఏర్పాట్లు చేపట్టలేదు. లోక్‌సభ ఎన్నికలు ముగిసేదాకా ఆగాలని కాంగ్రెస్ ప్ర భుత్వం భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో స్పెషలాఫీసర్ల పాలనకు మొగ్గు చూపే అవకాశమున్నట్లు సమాచారం. ప్రస్తుత సర్పంచ్‌ల పదవీ కాలం ముగిసినా వారినే పర్సన్ ఇన్‌చార్జీలుగా కొనసాగించే అవకాశం లేదు. 2018లో బీఆర్ఎస్ ప్రభుత్వం తీసుకువచ్చిన నూత న పంచాయతీ రాజ్ చట్టం ప్రకారం పాలకవర్గాల గడువు ముగిసేలోపు ఎన్నికలు నిర్వహించాలి. లేదంటే ప్రత్యేకాధికారులకు బాధ్యతలు అప్ప గించా లని చట్టంలో స్పష్టం చేసింది. ఈ దిశగానే ప్రభుత్వం యోచి స్తున్నట్లుగా తెలుస్తోంది. ఇప్పటి వరకు అధికారికంగా ఎలాంటి ఉ త్తర్వులు అందకపోయినప్పటికీ అంతర్గత ఆదేశాల మేరకు ఆయా పంచా యతీల పర్సన్ ఇన్‌చార్జీలుగా నియమించే అధికారు ల వివరాలను ఉన్నతాధికారులు సేకరిస్తున్నట్లుగా తెలుస్తోంది. ఎంపీ ఎన్నికలకు సంబంధం లేనటువంటి వారిని గుర్తిస్తున్నారు. బోథ్, ఇంద్రవెల్లి, ఇచ్చోడ, బేల వంటి మేజర్ గ్రామ పంచాయతీలకు జిల్లా స్థాయి అధికారులను ప్రత్యేకాధికారులుగా ని యమించే అవకాశముందనే అభిప్రాయం వ్యక్తమవుతుంది. మిగతా పంచాయ తీలకు ఎన్నికలతో ప్ర త్యక్ష సంబంధం లేని మండలస్థాయి అధికా రులను నియమించనున్నట్లుగా తెలుస్తోంది. గ్రామ పంచాయతీల్లో ప్రత్యేకాధికారుల పాలనకు సంబంధించి ప్రభుత్వం ఇంకా ఎలాంటి అధికారిక ఉత్తర్వులు రాలేదు. నిర్దిష్ట గడువులోపు ఎన్నికలకు అవకాశం లేకపోవడంతో స్పెషలాఫీసర్ల పాలనకే అవకాశముంటుంది. ప్రభుత్వ ఆదేశాలకనుగుణంగా చర్యలు తీసుకుంటాం.

## సమీపిస్తున్న జాతర..

# ఇంకా మేలుకోని యంత్రాంగం!



గోదావరిఖని: వనదేవతలైన సమ్మక్క సారలమ్మ జాతర సమీపిస్తోంది. రామగుండం కోల్‌బెల్టు ప్రాంతంలో భారీ ఎత్తున వేడుకలను నిర్వహిస్తుండగా అధికార యంత్రాంగం ఇంకా పనులు మొదలు పెట్టలేదు. దాదాపు ఆరు నుంచి ఎనిమిది లక్షల మంది భక్తులు హాజరయ్యే జాతరకు ఏర్పాటలను స్థానిక పరిశ్రమలతో పాటు నగరపాలక సంస్థ చేపట్టనుంది. గోదావరినది ఒడ్డున నిర్వహించే జాతరకు ఇతర ప్రాంతాల నుంచి కూడా భక్తులు అధిక సంఖ్యలో భక్తులు తరలి వస్తారు. ఈసారి జాతర ప్రాంగణంలో చెత్తను వేయడం వల్ల ఈ ప్రాంతమంతా దుర్గంధం వ్యాపిస్తోంది. దీనిని శుభ్రం చేసేందుకే కనీసం 20 రోజుల సమయం పడుతుంది. సమయం దగ్గరపడుతుండటంతో ఏర్పాట్లపై అధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. ఇది వరకు ఎన్నడూ లేని విధంగా చెత్తకుప్పల సమస్య జాతర ప్రాంగణంలో నెలకొంది. నగరపాలక సంస్థ సిబ్బంది సేకరించిన చెత్తను జాతర ప్రాంగణంలోని ఖాళీస్థలంలో డంప్ చేశారు. దీంతో పరిసర ప్రాంతాలన్నీ అపరిశుభ్రంగా మారాయి. ఈ చెత్తను తొలగించడానికే చాలా సమయం పడుతుంది. జాతర ప్రాంతానికి వెళ్లే రహదారికి ఇరువైపులా, వెనుక నుంచి వచ్చే మరో రహదారికి ఇరువైపులా చెత్తకుప్పలను డంప్ చేశారు. భక్తులు విడిది చేసే ప్రాంతాలన్నీ వ్యర్థాలతో నిండిపోయి దుర్గంధం వ్యాపించింది. భక్తులు స్నానాలు ఆచరించే ప్రాంగణం దుర్గంధభరితంగా మారింది. గోదావరినది ఒడ్డున చెత్తకుప్పలతో పాటు వ్యర్థాలు చేరి కంపు కొడుతున్నాయి. పక్కనే స్నానఘట్టాలు ఉండటంతో వెంటనే శుభ్రం చేయకుంటే అక్కడ పుణ్యస్నానాలు ఆచరించడం సాధ్యం కాదు. నది ఒడ్డున చేరిన వ్యర్థాలు కుళ్లిపోయి దుర్వాసన వస్తుంది. చెత్తకుప్పలతో పాటు పరిసరాలు మొత్తం అపరిశుభ్రంగా ఉన్నాయి. జల్లు స్నానాలకు సైతం ఇదే ప్రాంతంలో ఏర్పాట్లు చేయనున్నారు. అధికార యంత్రాంగం వెంటనే దీనిపై దృష్టి సారించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచే విధంగా ఏర్పాట్లు చేయాల్సిన అవసరం ఉంది. సమ్మక్క సారలమ్మ జాతర ఆవర ణలో చెట్ల పొదలు పెరిగాయి.

జాతర ప్రహరీ పక్కన, లోపలి భాగంలో పిచ్చి మొక్కలు పెరిగి ఆవరణ మొత్తం నిండిపోయాయి. అమ్మవార్ల గద్దెలతో పాటు పగిడిద్దరాజు, గోవిందరాజుల గద్దెలు ఉన్న ఆవరణలో పిచ్చి మొక్కలను తొలగించాలి. ఆవరణను శుభ్రం చేయ డంతో పాటు గద్దెలకు రంగులు వేయాల్సి ఉంది. సమయం తక్కువగా ఉండటంతో జాతర నిర్వాహణకు ఏర్పాట్లపై వేగం పెంచాలి. భక్తులకు సౌకర్యాల విషయంలో అధికార యంత్రాంగం దృష్టి సారించాలి.


విద్యుత్తు దీపాలతో పాటు నీటి సౌకర్యం కల్పించే విషయంలో పనులు చేపట్టాలి. జాతరకు చేరుకునే రెండు మార్గాలకు ఇరువైపులా భక్తులు విడిది చేసే విధంగా ప్రాంతాన్ని చదును చేయాలి. దర్శనం కోసం వచ్చే భక్తుల క్యూలైన్ కోసం బారికేడ్లు నిర్మించాలి. స్నానఘట్టాల వద్ద జల్లు స్నానాలకు నల్లాలు బిగించాలి. మరుగుదొడ్లు ఏర్పాటు చేయాల్సి ఉంది. ఆయా పనులను ఇప్పటి నుంచి పనులు మొదలు పెడితేనే భక్తులకు సమకూరుతాయి. ఆయా అంశాలపై అధికారులు, పాలకులు దృష్టి సారించాలని నగర ప్రజలు కోరుతున్నారు.

# రైతులకు సాగునీటి భరోసా కల్పించాలి



నర్సంపేట : కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు సాగునీటి విషయంలో భరోసా కల్పించాలని మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి డిమాండ్ చేశారు. నర్సంపేటలోని బీఆర్ఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారులు, కాంగ్రెస్ నాయకుల ప్రకటనలతో రైతులు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. కేసీఆర్ సర్కార్ నర్సంపేట నియోజకవర్గంలో ఇరిగేషన్ సర్క్యూట్ ప్లాన్ ప్రకారం గోదావరి జలాలను తీసుకొచ్చి నాలుగేళ్లపాటు రెండు పంటలకు సమృద్ధిగా నీరందించినట్లు గుర్తుచేశారు. ప్రత్యేక ప్రణాళికతో గోదావరి జలాలను తీసుకొచ్చామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం సాగునీరు అందిస్తుందా? లేదా? అని రైతులు ఆందోళన చెందుతున్నారని వివరించారు. ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి సాగునీటిపై ఒక్కసారైనా అధికారులతో సమీక్షించారా అని ప్రశ్నించారు. గతంలో పూడుకుపోయిన డీబీఎం 38, 40, 48 కాల్వలను తాము పునరుద్ధరించి, కాకతీయ కాల్వపై క్రాస్ రెగ్యులేటరీ నిర్మించి సమృద్ధిగా నీరందించి పంటల సాగుకు కృషి చేశామని చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో నియోజకవర్గంలోని ప్రతి ఎకరాకు సాగు నీరందించామని స్పష్టం చేశారు. గతంలో పాకాలకు గోదావరి జలాలు రావడం బూటకమని కాంగ్రెస్ నాయకులు అన్నారని, ఇప్పుడు ఏ ప్రాతిపదికన తైబందీ ఖరారు చేశారో ఎమ్మెల్యే చెప్పాలని డిమాండ్ చేశారు. గోదావరి ప్రాజెక్టులో నీటి నిల్వలు ఉన్నప్పటికీ ఎస్సారెస్పీ కాల్వల ద్వారా నీళు ఎందుకు రావడం లేదని ప్రశ్నించారు. ఎమ్మెల్యే సమక్షంలో 100 శాతం తైబందీని ఖరారు చేసిన తర్వాత రైతులు నార్లు పోసుకున్నారని గుర్తుచేశారు. తక్షణమే ఎమ్మెల్యే దొంతి సాగునీటిపై ఇరిగేషన్, రెవెన్యూ అధికారులతో సమీక్షించి, రైతుల అయోమయానికి తెరదించాలని పెద్ది డిమాండ్ చేశారు. సమావేశంలో ఖానాపురం ఎంపీపీ వేములపల్లి ప్రకాశ్‌రావు, ఓడీసీఎంఎస్ చైర్మన్ గుగులోత్ రామస్వామీనాయక్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు నాగెల్లి వెంకటనారాయణగౌడ్, బీఆర్ఎస్ ఖానాపురం మండల అధ్యక్షుడు వెంకటనారాయణ, వైస్ ఎంపీపీ ఉపేందర్‌రెడ్డి, సుధాకర్, యువరాజు పాల్గొన్నారు.

# అసంపూర్తి నిర్మాణాలు.. అంగన్‌వాడీల్లో అవస్థలు



ముస్తాబాద్: అంగన్‌వాడీ కేంద్ర భవన నిర్మాణ పనులు నిధుల లేమితో ముందుకు సాగడం లేదు. మరోవైపు కనీస సౌకర్యాలు లేక చిన్నారులు ఆట పాటల చదువులకు దూరమవుతున్నారు. ఇరుకు గదుల్లో అరకొర వసతుల మధ్య ఏళ్ల తరబడి కాలం వెల్లదీయాల్సిన పరిస్థితి నెలకొంది. ముస్తాబాద్ మండలంలో 22 గ్రామాలకు గాను 52 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. మినీ కేంద్రం ఒకటి ఉంది. 23 కేంద్రాలకు మాత్రమే సొంత భవనాలు ఉన్నాయి. 28 కేంద్రాలను ప్రాథమిక పాఠశాలల గదుల్లో, అద్దె భవనాల్లో నిర్వహిస్తున్నారు. 52 అంగన్‌వాడీ కేంద్రాలకుగాను 5 ఆయా పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అన్ని కేంద్రాల్లో కలిపి 2,364 మంది చిన్నారులు ఉన్నారు. మండల కేంద్రంలోని మండల వనరుల కేంద్రం పక్కన ఉన్న ప్రాథమిక పాఠశాల ఆవరణలోని ఒకే గదిలో ఏళ్ల తరబడి నాలుగు కేంద్రాలు నిర్వహిస్తున్నారు. పోత్గల్‌లో అంబేద్కర్‌నగర్‌లోని మహిళా సంఘం అద్దె భవనంలో కొనసాగుతోంది. ఇరుకు గదుల్లో చిన్నారుల చదువులు కొనసాగుతున్నాయి. అంగన్‌వాడీ కేంద్రాల సమీపంలో సరైన స్థలం లేకపోవడంతో పెరటి తోటలు కనిపించే దాఖలాలు లేవని చిన్నారుల తల్లిదండ్రులు వాపోతున్నారు. డీఎంఎఫ్‌టీ నిధులు మంజూరు కాగా ఒక్కో భవనం రూ. 7 లక్షల వ్య యంతో నిర్మాణ పనులు ప్రారంభించారు. ముస్తాబాద్ మండల వనరుల కేంద్రం సమీపంలో, పోత్గల్ ప్రాథమిక పాఠశాల (కట్టమీది బడి) ఆవరణలో, గన్నెవారిపల్లెలో ప్రాథమిక పాఠశాల పక్కనే అంగన్‌వాడీ కేంద్రాలకు నూతన భవన నిర్మాణాలకు శ్రీకారం చుట్టారు. ముస్తాబాద్, పోత్గల్, గన్నెవారిపల్లెలో నిధుల లేమితో పనులు మధ్యలోనే నిలిచిపోయాయి. మరో రూ. 7 లక్షలు మంజూరు చేస్తే పనులు పూర్తవుతాయని సంబంధిత అధికారులు పేర్కొంటున్నారు. అదే డీఎంఎఫ్‌టీ నిధులు ఒకేసారి రూ. 14 లక్షలు మంజూరు చేయడంతో ముస్తాబాద్ మండల కేంద్రంలోని కేసీఆర్ కాలనీ రెండు పడక గదుల ఇళ్ల మధ్య నిర్మించిన నూతన అంగన్‌వాడీ కేంద్రం పనులు చివరి దశకు చేరుకున్నాయి. త్వరలో ప్రారంభించడానికి సిద్ధం చేస్తున్నారు. మిగిలిన వాటికి కూడా నిధులు మంజూరు చేసి భవనాల పూర్తికి అధికా రులు చర్యలు తీసుకోవాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు. డీఎంఎఫ్‌టీ నిధులతో మూడు గ్రామాల్లో ఒక్కొక్కటి రూ.7 లక్షల చొప్పున మూడు అంగన్‌వాడీ కేంద్రాలకు భవనాలు మంజూరయ్యాయి. ముస్తాబాద్, పోత్గల్, గన్నెవారిపల్లె గ్రామాల్లో నూతన భవన నిర్మాణాలు చేపట్టాం. అయితే నిధుల లేమితో పనులు మధ్యలో నిలిచిపోయాయి. మరో రూ. 7 లక్షల చొప్పున మంజూరు చేస్తే పూర్తయ్యే అవకాశం ఉంది. ముస్తాబాద్ మండల కేంద్రంలోని కేసీఆర్ కాలనీలోని భవనం పనులు చివరి దశకు చేరుకున్నాయి. భవనాన్ని త్వరలో ప్రారంభించడానికి సిద్ధం చేస్తున్నాం. మూడు గ్రామాల్లో నిలిచిపోయిన భవనాలకు నిధులు రాగానే పనులు ప్రారంభించేందుకు చొరవ చూపుతాం.

## జిల్లాలో అంగన్‌వాడీలు అప్‌గ్రేడ్

# ఈ నెల నుంచే మినీ టీచర్లకు కొత్త జీతాలు



భద్రాద్రి కొత్తగూడెం : మహిళా, శిశు సంక్షేమ శాఖ పరిధిలో నడుస్తున్న మినీ అంగన్‌వాడీలు మెయిన్ అంగన్‌వాడీలుగా మారాయి. దీంతో మినీ అంగన్‌వాడీ టీచర్లు మెయిన్ అంగన్‌వాడీ టీచర్లుగా అప్‌గ్రేడ్ అయ్యారు. ఈ ప్రతిపాదన గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో పురుడు పోసుకోగా.. ఎన్నికల నేపథ్యంలో అమలు కాలేదు. ప్రస్తుతం ఏర్పడిన కొత్త ప్రభుత్వంలో మెయిన్ అంగన్‌వాడీలుగా మారడంతో టీచర్లు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటివరకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ప్రధాన అంగన్‌వాడీ కేంద్రాలు 1,434 ఉండగా.. మినీ కేంద్రాలు 626 ఉన్నాయి. మొత్తం 11 ప్రాజెక్టుల్లో అంగన్‌వాడీ సేవలు పిల్లలు, బాలింతలు, తల్లులకు అందుతున్నాయి. తక్కువ కుటుంబాలు, రెవెన్యూ గ్రామాలకు ఆవాసాలు దూరంగా ఉండడం కారణంగా అప్పట్లో(పదేళ్ల క్రితం) మినీ అంగన్‌వాడీ కేంద్రాలను ఏర్పాటు చేశారు. అక్కడ ఉన్న తల్లులు, పిల్లలకు ఫీడింగ్‌తోపాటు ఇమ్యునైజేషన్ కోసం ఏర్పాటు చేసిన ఈ మినీ అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో కుటుంబాలు పెరగడంతో ప్రస్తుతం సేవలు చేయడం ఇబ్బందికరంగా మారింది. మినీ అంగన్‌వాడీ కేంద్రంలో ఆయా, టీచర్ పోస్టును ఒకరే నిర్వహించాలి. కుటుంబాలు సంఖ్య పెరిగిన తర్వాత సేవలు అందించడం ఇబ్బందిగా ఉన్నందున మినీ కేంద్రాలను ప్రధాన కేంద్రాలుగా మార్చాలని కమిషనర్ దృష్టికి రావడంతో అది ప్రభుత్వ పరిశీలనకు వెళ్లి గ్రీన్‌సిగ్నల్ పడింది. మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ అంగన్‌వాడీ టీచర్లకు సమ్మె సమయంలో హామీ ఇచ్చారు. కొత్త పీఆర్‌సీలో వేతనాలు అందరిలాగే పెంచడంతోపాటు మినీలను అప్‌గ్రేడ్ చేస్తామని ప్రభుత్వ అనుమతి కూడా తీసుకున్న సంగతి తెలిసిందే. మినీ అంగన్‌వాడీ కేంద్రాలు అప్‌గ్రేడ్ కావడంతో కొత్తగా ఆయాల పోస్టులు పెరిగే అవకాశాలు ఉన్నాయి. మినీ అంగన్‌వాడీ టీచర్ల జీతం పెరిగింది. ప్రస్తుతం తీసుకుంటున్న జీతం రూ.7,800 కాగా.. ఈ నెల నుంచి రూ.13,650 తీసుకోనున్నారు. దీంతో మినీ టీచర్లలో ఆనందం వెల్లివిరుస్తున్నది. ఇదేకాక కొత్తగా ఆయా పోస్టులు పెరగడంతో స్థానిక మహిళలు నోటిఫికేషన్ కోసం ఎదురుచూస్తున్నారు. ఆయా పోస్టులకు త్వరలో నోటిఫికేషన్ విడుదల కానున్నట్లు సమాచారం. మినీ అంగన్‌వాడీ కేంద్రాలను ప్రధాన కేంద్రాలుగా మార్చడంలో ఆ శాఖ కొన్ని నిబంధనలను విధించింది. గిరిజన ప్రాంతాల్లో 300 కుటుంబాలకు పైగా ఉన్న గ్రామంలో ఉన్న సెంటర్‌ను ప్రధాన అంగన్‌వాడీ కేంద్రంగా చేయాలని నిర్ణయించారు. గ్రామీణ ప్రాంతం, అర్బన్ ఏరియాలో 400 కుటుంబాలు ఉన్న సెంటర్లను ప్రధాన సెంటర్లగా మార్చేందుకు ప్రతిపాదనలు పంపారు.

# మూడో లైన్‌పై రైళ్ల రవాణాకు గ్రీన్ సిగ్నల్

కాజీపేట : దక్షిణ మధ్య రైల్వే సికింద్రాబాద్ రైల్వే కాజీపేట రైల్వే సబ్ డి విజన్ పరిధిలోని కాజీపేట రైల్వే జంక్షన్ - బల్లార్ష సెక్షన్‌లోని మూడో లైన్ రైళ్లు పరుగులు పెట్టేందుకు సిద్ధమైంది. ఈ మార్గంలో నిత్యం వందలాది గూడ్స్, ప్రయాణికుల రైళ్లు రాకపోకలు సాగిస్తుండగా రద్దీగా ఉంటోంది. దీంతో తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తర్వాత తొలి సీఎం కేసీఆర్ నేతృత్వంలో ఎంపీలు బల్లార్ష-కాజీపేట రైల్వే జంక్షన్‌కు మూడో లేన్ ఏర్పాటు చేయాలని పలు దఫాలుగా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి చేశారు. ఈమేరకు కేంద్రం 2015-16 రైల్వే బడ్జెట్‌లో కాజీపేట రైల్వే జంక్షన్- బల్లార్ష సెక్షన్‌లో (తెలంగాణ, మహారాష్ట్రలలో) హసన్‌పర్తి రోడ్డు - రైల్వేస్టేషన్ వరకు 202 కిలోమీటర్ల మూడో నిర్మాణానికి రైల్వేబోర్డు రూ.2,063కోట్ల నిధులను మంజూరు చేసింది. పనులు యుద్ధప్రాతిపాదికన జరిగాయి. రైల్వేశాఖ రాఘవపూర్ -మందమర్రి వరకు 33కిలోమీటర్లు, సిర్పూర్ కాగజ్‌నగర్ - మాణిక్‌ఘర్ వరకు 60 కిలోమీటర్ల మూడో లైన్‌ను గతంలోనే పూర్తి చేయగా హసన్‌పర్తి రోడ్డు - ఉప్పల్ రైల్వేస్టేషన్ వరకు మూడోలైన్ పనులు అన్ని విధాలా కావడంతో ఇటీవల రైల్వే జీఎం ఏకే జైన్ ఆదేశాలతో రైల్వే ఉన్నతాధికారులు తనిఖీలు నిర్వహించి ఆ పట్టాల మీదుగా గూడ్స్, ప్యాసింజర్ రైళ్లను నడిపించవచ్చని గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. హసన్‌పర్తి రోడ్డు - మాణిక్‌ఘర్ రైల్వేస్టేషన్ వరకు మూడో లైన్‌లో రైళ్లు షురువైతే మహారాష్ట్రలోని మాణిక్‌ఘర్‌కు నేరుగా రైళ్లు అధికారులు చెబుతున్నారు.

# వరుసగా ఏటీఎంలు ధ్వంసం.. ఒకరి అరెస్టు




వినాయక్‌నగర్ : నిజామాబాద్ నగరానికి చెందిన ఓ యువకుడు మద్యానికి బానిసగా మారి, డబ్బుల కోసం ఏటీఎంలను ధ్వంసం చేస్తున్నాడు. నెలవ్యవధిలో రెండుసార్లు ఏటీఎంలను ధ్వంసం చేసిన నిందితుడిని పోలీసులు పట్టుకున్నారు. ఏసీపీ కార్యాలయంలో సీసీఎస్, నిజామాబాద్ ఇన్‌చార్జి ఏసీపీ విజయసారథి, నగర సీఐ నరహరి ఇందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. నగరంలోని మిర్చికాంపౌండ్‌కు చెందిన యువకుడు పడమటి రమేశ్ కూలీ పనిచేస్తాడని తెలిపారు. మద్యానికి బానిసగా మారి, డబ్బుల కోసం డిసెంబర్ 18న రాత్రి అర్సపల్లి వద్ద ఉన్న ఎస్‌బీఐ ఏటీఎంను ధ్వంసం చేసి, నగదు దొంగిలించడానికి యత్నించాడని వెల్లడించారు. అదే సమయంలో ఏటీఎం సెంటర్‌లోని అలారం మోగడంతో నిందితుడు అక్కడి నుంచి పారిపోయినట్లు తెలిపారు. ఈనెల 16న గోశాల రోడ్డులో ఉన్న ఎస్‌బీఐ ఏటీఎం మిషన్‌ను రాడ్‌తో ధ్వంసం చేశాడు. అలారం మోగిన వెంటనే పరారయ్యాడని, ఈ కేసును ఛేదించిన నగర సీఐ నరహరి, వన్‌టౌన్ ఎస్సై-2 విష్ణుప్రకాశ్, ఏఎస్సై షకీల్, సిబ్బంది గంగారాం, మధును ఇన్‌చార్జి ఏసీపీ అభినందించారు. జల్సాలకు అలవాటు పడి బైక్‌లను చోరీ చేస్తున్న ఇద్దరు నిందితులను పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను సీసీఎస్, నిజామాబాద్ ఇన్‌చార్జి ఏసీపీ విజయసారథి వెల్లడించారు. జిల్లాకేంద్రంలోని చంద్రానగర్‌కు చెందిన న్యాలకంటి శేఖర్ (ల్యాబ్ టెక్నీషియన్), సీతారాంనగర్ కాలనీకి చెందిన అక్నూర్ సతీశ్ (కార్పెంటర్) కలిసి బైక్‌లు చోరీలు చేసినట్లు వెల్లడించారు. నిజామాబాద్ వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ ఏరియాలో రెండు బైకులు, ఆర్మూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో రెండు బైక్‌లను చోరీచేసినట్లు తెలిపారు. చోరీ చేసిన బైక్‌లను విక్రయించేందుకు వెళ్తూ.. అనుమానాస్పదంగా కనిపించడంతో నగర సీఐ నరహరి ఆధ్వర్యంలో వన్‌టౌన్ ఎస్సై-2 విష్ణుప్రకాశ్, సిబ్బందితో కలిసి పట్టుకున్నట్లు వివరించారు. నిందితుల నుంచి నాలుగు బైక్‌లను స్వాధీనం చేసుకొని.. కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు వివరించారు.

# కృష్ణాతీరం.. చెత్తమయం



ఇటిక్యాల, : పవిత్రమైన బీచుపల్లి క్షేత్రానికి పక్కనే కృష్ణానది ఉన్నది. అక్కడున్న పు ష్కరఘాట్‌లో పారిశుధ్యం కొరవడడంతో ఈ క్షేత్రానికి వచ్చే భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రస్తుతం కృష్ణనదిలో అంతంతమాత్రంగా ఉన్న నీటి లభ్యతతో పిల్లకాల్వను తలపిస్తూ ప్రవహిస్తున్న నదిలో విడిచినపాత దుస్తులు, చెప్పులు, పూలదండలు, ప్లాస్టిక్ సంచులు దేవుని చిత్రపటా లు, అస్థికలు కలగలిసి మురుగు కాల్వను తలపించేలా నది పవిత్రతను పాడు చేస్తున్నాయి. ముఖ్యంగా మాలధారణ చేసిన భక్తులు మాలధారణ పూర్తి కాగానే ధారణ సమయంలో ధరించిన దుస్తులను నదిలో విడవడం, అలాగే కర్మఖాండల నిమిత్తం క్షే త్రానికి వచ్చేవారి వారి వెంట సంచులలో వివిధ రకాల వస్తువులను తీసుకొని అస్థికలతోపాటు వదలడంతో నదిలో రోజురోజుకూ చెత్తాచెదారం నిండిపోతున్నది. వ్యర్థాలు అన్నీ నదీ ప్రవాహం ఎక్కువగా ఉన్నప్పుడు ప్రవాహ వేగానికి కొట్టుకుపోయేవి. ప్రస్తుతం వేసవి సమీపిస్తుండడంతో నది అంతంతమాత్రంగా ప్రవహిస్తున్నది. దీంతో పుష్కరఘాట్ మెట్లపై నదీ రాళ్ల మధ్య వ్యర్థాలన్నీ ఇరుక్కు పోవడంతో వివిధ ప్రాంతాల నుంచి బీచుపల్లి దర్శనానికి వచ్చే భక్తులు నదీ స్నానాలు ఆచరించేందు కు, పూజలు నిర్వహించేందుకు ఇబ్బందికరంగా మారింది. నదిలో పేరుకుపోయిన చెత్తకు తోడు స మీపంలో ఉన్న ఫ్యాక్టరీల నుంచి వెలువడే కాలు ష్యం కూడా తోడవ్వడంతో నదీజలాలు మరింతగా కలుషితంగా మారాయి. దీంతో చాలామంది భక్తులు నదిలో స్నానం చేయకుండానే వెనుదిరిగే పరిస్థితులు ఏర్పడ్డాయి. అయితే దేవస్థానం వారు నిర్వహించే పుష్కరఘాట్ పారిశుధ్య పనులను కొన్ని రోజులుగా గ్రామ పంచాయతీ వారు నిర్వహించ డం మొదలు పెట్టారు. ఇందుకు గానూ టోల్ వసూ లు టెండర్ రూ.3.71 లక్షలకు టెండర్ దక్కించుకొన్న వ్యక్తి పుష్కరఘాట్‌కు వచ్చే వాహనాలకు బస్‌కు రూ.50, కార్లకు రూ.30 చొప్పున వసూల్ చేస్తున్నాడు. దీని నుంచి ఆదాయం బాగానే వస్తు న్నా.. పుష్కరఘాట్‌లో నిత్యం చేపట్టాల్సిన పారిశుధ్య పనులను పట్టించుకోకపోవడంతో నిత్యం వేలాదిగా వచ్చే భక్తులకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. బీచుపల్లి క్షేత్రం పవిత్రతకు భంగం వాటిల్లేలా వ్యవహరిస్తున్న పంచాయతీ వారి నుంచి దేవాలయం వారే పుష్కరఘాట్ పారిశుధ్య పనులు చేపట్టి నది పవిత్రతను కాపాడాలని భక్తులు కోరుకుంటున్నారు. నాలుగైదు రోజుల నుంచి రాత్రిపూట భక్తులు విపరీతంగా వస్తున్నారు. ముఖ్యంగా మాల ధారణ చే సిన భక్తులు దుస్తులను నదీలో విడవడంతో చెత్త పేరుకు పోయిన మాట వాస్తవమే. అలాగే పండుగ ఉండడం వలన పారిశుధ్య పనులు చేసే సిబ్బంది రావడం లేదు. దీంతో నదిలో చెత్త మరింతగా పేరుకుపోయింది. వెంటనే సిబ్బందిని పురమాయించి చెత్తాచెదారం తొలగించేలా చర్యలు తీసుకుంటాం.

# సాంకేతిక సేవలకు పంచాయతీలు దూరం



నల్గొండ :గత ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన టీ – ఫైబర్ కార్యక్రమం అమలు క్షేత్రస్థాయిలో చురుగ్గా సాగడం లేదు. పట్టణాల్లో మాదిరిగానే రాష్ట్రంలోని ప్రతి మారుమూల పంచాయతీలకు డిజిటల్ సొబగులు అద్ది అంతర్జాల కనెక్షన్ ద్వారా ప్రజలకు ఎలాంటి ఆటంకం లేకుండా ప్రభుత్వ సేవలను అందించేందుకు 2017లో ఈ పథకానికి అంకురార్పణ జరిగింది. సుమారు మూడేళ్ల క్రితం ఈ పథకం పనులు ఉమ్మడి జిల్లాలో ప్రారంభించినా.. ఇప్పటి వరకు సగం పంచాయతీల్లోనూ అమల్లో లేకపోవడం ప్రస్తుత పరిస్థితికి అద్దం పడుతోంది. పంచాయతీలో పారిశుద్ధ్యం, వీధి దీపాల నిర్వహణ, వ్యర్థాల సేకరణ వివరాలు, ప్రస్తుతం పంచాయతీలో అమలవుతున్న అభివృద్ధి పనులకు సంబంధించి నిధుల కేటాయింపు, ఖర్చు, జనన, మరణ ధ్రువీకరణ పత్రాల జారీ, ఆదాయ వ్యయాలు, ఉద్యోగుల జీతాల లెక్కలన్నీ డిజిటల్ రూపంలో ప్రతి పంచాయతీల్లో అందుబాటులో ఉంచాలన్నది ఈ పథకం ప్రధాన ఉద్దేశం. ఇందుకు అన్ని పంచాయతీలకు గతంలోనే మిషన్ భగీరథ పైప్‌లైన్ నిర్మాణంతో పాటే నెట్‌కు సంబంధించిన ఫైబర్ ఆప్టిక్ కేబుళ్లను వేశారు. పలు పంచాయతీల్లో సర్వర్లు, వాటికి కావాల్సిన మౌలిక సౌకర్యాలను సైతం కల్పించారు. అయితే పంచాయతీలకు అంతర్జాల కనెక్షన్ ఇవ్వకపోవడంతో ప్రజలకు సాంకేతిక సేవలు అం దని ద్రాక్షగానే మిగులుతున్నాయి. యాదాద్రి జిల్లాలోని 421 పంచాయతీలకు ఫైబర్ ఆప్టిక్ కేబుళ్లను వేసి రెండున్నరేళ్లు అవుతున్నా చాలా పంచాయతీలకు నెట్ కనెక్షన్ ఇవ్వకపోవడంతో పథకం ఉద్దేశం ప్రజలకు చేరడం లేదు. కొన్ని చోట్ల సర్వర్‌లను అమర్చగా, మరికొన్ని చోట్ల సోలార్ ప్యానెళ్లను సైతం అమర్చారు. నిర్వహణ లేక అవి నిరుపయోగంగా ఉండటంతో తుప్పు పడుతున్నాయి. నల్గొండ జిల్లాలోని 844 గ్రామాలకు రెండేళ్ల క్రితం ఫైబర్ వేసే పనులు చేపట్టగా ఇంకా 100 వరకు పంచాయతీలకు కేబుల్ వేసే పనులు అసంపూర్తిగా ఉన్నట్లు తెలిసింది. సూర్యాపేట జిల్లాలోనూ పరిస్థితి ఇందుకు భిన్నంగా ఏమీ లేదు. మూడు జిల్లాల్లో పనుల పురోగతిపై 'ఈనాడు' ఆరా తీయగా సంబంధిత అధికారులు, గుత్తేదారులెవరూ పనుల పురోగతికి సంబంధించి వివరాలు ఇవ్వడానికి నిరాకరించడం గమనార్హం. జిల్లా స్థాయిలో పర్యవేక్షణ లేకపోవడంతోనే పనుల్లో తీవ్ర జాప్యం జరుగుతుందన్న వాదన వినిపిస్తోంది. జిల్లా కలెక్టరు పరిధిలోకి ఆయా అధికారులను తీసుకువచ్చి పనులపై నిత్య పర్యవేక్షణ ఉంటేనే రానున్న కాలంలో ఈ పనులు త్వరితగతిన పూర్తికానున్నాయి.

# దిద్దుబాటు చర్యలతో కాసింత గిట్టుబాటు..!



ఖమ్మం :ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో అధికారులు దిద్దుబాటు చర్యలు ప్రారంభించారు. మిరప ధరలు పడిపోయిన సందర్భంగా వ్యవసాయ, సహకార, మార్కెటింగ్ చేనేతశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మార్కెట్‌ను ఇటీవల సందర్శించారు. రైతుల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకున్నారు. అనంతరం మార్కెటింగ్‌శాఖ సంచాలకు రాలు లక్ష్మీబాయితో కలిసి వ్యాపారులు, రైతులతో సమావేశమయ్యారు. మార్కెట్‌లో నెలకొన్న ప్రధాన సమస్యలపై చర్చించారు. రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా అధికారులను ఆదే శించారు. ఖమ్మం మార్కెట్ యార్డును అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్, మార్కెటింగ్‌శాఖ ఉపసంచాలకుడు అజ్మీరా రాజు బుధవారం సందర్శించారు. వీరి వెంట డీఎంఓ అలీం, మార్కెట్ ఇన్‌ఛార్జి కార్యదర్శి బజారు ఉన్నారు. మార్కెట్‌లో జెండా పాట, రైతులకు లభిస్తున్న ధరల గురించి తెలుసుకున్నారు. రెండు మార్కెట్లలో కలిపి సుమారు 24 సీసీ కెమెరాలు ఉన్నా ఇటీవల వరకు ఇవి పనిచేయలేదు. వీటికి మరమ్మతులు చేయించారు. మిరప కొనుగోళ్ల వైపు సీసీ కెమెరాలు ఉండేలా చూడాలని మార్కెట్ అధికారులను ఆదేశించారు. విపణిలో పారిశుద్ధ్యం, శౌచాలయాల నిర్వహణ, తాగునీటి సౌకర్యం, దడవాయిలు కాంటా వేసే విధానం గురించి ఆరా తీశారు. ఆరు రోజుల తర్వాత ప్రారంభమవటంతో మార్కెట్‌కు సుమారు 20వేల బస్తాల మిరప వచ్చింది. ఎండు మిరప క్వింటా గరిష్ఠ ధర రూ.21,300, నమూనా ధర రూ.18వేలు, కనిష్ఠ ధర రూ.6,300 చొప్పున వ్యాపారులు కొన్నారు. తాలు మిరప క్వింటా గరిష్ఠ ధర రూ.12వేలు, నమూనా ధర రూ.11వేలు, కనిష్ఠ ధర రూ.7వేల చొప్పున ఖరీదు చేశారు. గతంతో పోల్చితే రైతులకు కొంత ఊరట కలిగింది. మార్కెట్‌పై మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రత్యేక దృష్టి సారించటంతో గతంలో మాదిరిగా జెండా పాటకు వాస్తవ ధరకు ఎక్కువ వ్యత్యాసం లేకుండా చూడటం కొసమెరుపు.

# జేఈఈ మెయిన్స్ విద్యార్థులపై తగ్గిన భారం

ఖమ్మం:దేశవ్యాప్తంగా ప్రతిష్ఠాత్మక ఇంజినీరింగ్ కళాశాలల్లో ప్రవేశాలకు నిర్వహించే జేఈఈ మెయిన్స్ పరీక్షకు ఇక వారం రోజుల గడువు మాత్రమే ఉంది. ఈనెల 24 నుంచి ఫిబ్రవరి ఒకటో తేదీ వరకు ఈ పరీక్షలు నిర్వహిస్తారు. 24న మధ్యాహ్నం బీఆర్క్ పరీక్ష ఉంటుంది. 27, 29, 30, 31 ఫిబ్రవరి 1 వరకు బీటెక్ అర్హత పరీక్ష ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం జరుగుతుంది.


ఉమ్మడి ఖమ్మం జిల్లాలో సుమారు 25 వేల మంది విద్యార్థులు ఈ పరీక్షకు హాజరు కానున్నారు. బీఆర్క్ పరీక్షకు సంబంధించి ఖమ్మంలో పరీక్ష కేంద్రం ఏర్పాటు చేశారు. బీటెక్ పరీక్షకు సంబంధించి ఉమ్మడి జిల్లాలో ఎన్ని పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసే విషయం మరి కొద్దిరోజుల్లో తెలిసే అవకాశం ఉంది. గతంలో 300 మార్కులకు 250 నుంచి 260 వస్తే అఖిల భారత స్థాయిలో ఓపెన్ కేటగిరీలో 1000 లోపు ర్యాంకు వచ్చింది. ఈసారి మార్పులు చేసిన సిలబస్ ప్రకారం 260 నుంచి 270 మార్కులు వస్తే అఖిల భారత స్థా యిలో ఓపెన్ కేటగిరీలో 1000 లోపు ర్యాంకు వచ్చే అవకాశం ఉంటుందని విద్యావేత్తలు భావిస్తున్నారు. పరీక్షలు పూర్తయిన తర్వాత ప్రశ్న పత్రాల సరళిని బట్టి ఈ విషయంలో



మరింత స్పష్టత వచ్చే అవకాశం ఉంటుంది. ఈసారి సిలబస్‌లో మార్పులు చేశారు. గణితంలో 5 శాతం, భౌతికశాస్త్రంలో 5 శాతం సిలబస్ తగ్గించారు. రసాయనశాస్త్రంలో 20 శాతం తగ్గించారు. సిలబస్ నుంచి కొన్ని పాఠాలను సైతం మినహాయిం చారు. కొవిడ్ సమయంలో విద్యార్థులు ఉప అంశాలు నేర్చుకోలేదనే ఉద్దేశంతో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) వారు విద్యార్థులకు సిలబస్ తగ్గించి కొంత వెసులుబాటు కల్పించారు.

# ముంపు ముప్పు తప్పేలా రక్షణ గోడలు

ఖమ్మం:మున్నేరు నదికి ఏటా పోటెత్తే వరదల నుంచి ఖమ్మం నగరానికి శాశ్వత పరిష్కారం లభించనుంది. దీనికి ఓవైపు ఖమ్మం, మరోవైపు పాలేరు నియోజకవర్గాలకు చెందిన ప్రాంతాలున్నాయి. వరదలకు రెండువైపులా వందల సంఖ్యలో ఇళ్లు ముంపునకు గురవుతున్నాయి. ముంపు నుంచి ప్రజలకు రక్షణ కల్పించేందుకు నదికి రెండు వైపులా కరకట్టలు నిర్మించేందుకు అధికారులు ప్రతిపాదించగా ఇటీవల ప్రభుత్వం ఆమోదం తెలిపింది. మున్నేరు నదికి రెండువైపులా రక్షణ గోడలు (కాంక్రీట్ వాల్స్) నిర్మాణానికి ప్రభుత్వం రూ.690 కోట్లకు పరిపాలనపరమైన అనుమతులు మంజూరు చేసింది. తాజాగా రెండువైపులా 17 కి.మీ. పొడవున రక్షణ గోడల నిర్మాణానికి రూ.501.30 కోట్ల అంచనా వ్యయంతో నీటిపారుదల శాఖ టెండర్లు ఆహ్వానించింది. ఖమ్మంలోని నీటిపారుదల శాఖ ఎస్‌ఈ నర్సింగరావు ఆన్‌లైన్‌లో ఈ ప్రొక్యూర్‌మెంట్ విధానంలో టెండర్లు దాఖలుకు ఈనెల 31వ తేదీ తుది గడువుగా పేర్కొన్నారు. మున్నేరు నదికి ఎగువన పోలేపల్లి నుంచి దిగువన ప్రకాశ్‌నగర్ వరకు 8.5 కి.మీ. పొడవున నదికి రెండువైపులా కలిపి 17 కి.మీ. పొడవు వస్తుంది. నదికి రెండువైపులా గోడల మధ్య దూరం 230 మీటర్లుగా నిర్ణయించారు. నది మధ్య నుంచి ఒక్కోవైపు 115 మీటర్లు దూరం ఉ ంటుంది. నది ఒడ్డు మలుపులు ఉంటే అలాగే గోడ నిర్మిస్తారు. నది ఒడ్డున భూమి పొరల ఆధారంగా రక్షణ గోడ ఎక్కడ ఎంత లోతు నుంచి నిర్మించాలనేది పనుల సమయంలో నిర్ణయించనున్నారు. రక్షణ గోడ ఎత్తు 11 మీటర్లు (33 అడుగులు), వెడల్పు 8 మీటర్లు (25 అడుగులు)గా రూపొందించారు. నదిలో 3.50 లక్షల క్యూసెక్కుల వరద నీటి ప్రవాహం వేగంగా వచ్చినా తట్టుకునే రీతిలో గోడలు నిర్మించనున్నారు. ఖమ్మం పరిసరాల్లో మున్నేరు నదిపై రోడ్డు, రైలు వంతెనలు, ఎన్నెస్పీ అక్విడెక్టు ఉన్నాయి. వాటి వద్ద గోడల నిర్మాణంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. రోడ్డు వంతెనలకు మించి ఎత్తుగా రక్షణ గోలు వచ్చే అవకాశం ఉంది. నిర్మాణ సమయంలో అక్కడి పనులను ఉన్నతాధికారులు పర్యవేక్షించనున్నారు. గడిచిన వందేళ్లలో ఎన్నడూలేని విధంగా గత ఏడాది



జులై, ఆగస్టులో 30.7 అడుగుల మేర వరద పోటెత్తింది. ఖమ్మం నగరంలో వేలాది ఇళ్లు నీటి మునిగాయి. మరోవైపు ఖమ్మం గ్రామీణ మండలంలో జలగంనగర్, పెద్దతండా, కరుణగిరి తదితర ప్రాంతాల్లో ఇళ్లు మునిగాయి. అందుకే మున్నేరుకు రక్షణ గోడలు నిర్మించాలని నీటిపారుదల శాఖ అధికారులు ప్రతిపాదించారు. మున్నేరు నదికి రెండువైపులా రక్షణ గోడ నిర్మాణ సమయంలోనే వెలుపల వైపు మురుగుకాల్వలు నిర్మిస్తారు. నగరంలోని మురుగు కాల్వల నుంచి వచ్చే మురుగు మున్నేరులోనే కలుస్తుంది. రక్షణ గోడలకు వెలుపల ప్రాంతంలో నిర్మించే ప్రధాన కాల్వలోకి నగరంలోని మురుగుకాల్వలను అనుసంధానించాల్సి ఉంటుంది. ఇందుకు మున్సిపల్ అధికారులు ప్రణాళికలు రూపొంది స్తున్నారు. ప్రకాశ్‌నగర్ దిగువన మురుగునీటిని మున్నేరులో కలిపేలా ఏర్పాట్లుచేస్తున్నారు. మున్నేరు నదికి రక్షణ గోడలు, వెలుపలలో డ్రైనేజీ నిర్మాణానికి సుమారు 200 ఎకరాల భూమి సేకరించాల్సి ఉంటుందని అధికారులు అంచనా వేశారు. రెవెన్యూ, నీటిపారుదల శాఖ అధికారులు భూసేకరణ సర్వే పనులు చేపట్టారు. ప్రభుత్వ, ప్రైవేటు భూమి ఎంత సేకరించాలనేది సర్వే అనంతరం ఖరారు చేయనున్నారు. భూసేకరణకు సైతం ప్రభుత్వం నిధులు కేటాయించింది. మున్నేరు నదికి రెండువైపులా కరకట్టల నిర్మాణం పూర్తయితే వరద ముంపు నుంచి పూర్తి రక్షణ లభిస్తుంది.

# అల్పాహార పథకం.. ఆరంభశూరత్వం..!



కొత్తగూడెం: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణే ధ్యేయంగా సీఎం అల్పాహారం పథకాన్ని గత భారాస సర్కారు ప్రవేశపెట్టింది. దసరా తర్వాత అన్ని పాఠశాలల్లో అమలుచేయాలని నిర్ణయించింది. కొత్తగా కొలువుదీరిన కాంగ్రెస్ సర్కారు ఈ పథకాన్ని అన్ని పాఠశాలలకు వర్తింపజేస్తుందా.. లేదా అన్నది ప్రశ్నార్థకంగా మారింది. గ్రామీణ బాలబాలికలు ఉదయం ఏం తినకుండానే పాఠశాలలకు వెళ్తుంటారు. ప్రస్తుతం పథకం అమలవుతున్న విద్యాలయాల్లో పేద విద్యార్థులకు మేలు జరుగుతోంది. రక్తహీనత సమస్యను బాలికలు అధిగమించవచ్చు. తొలుత ప్రతి నియోజకవర్గంలో ఓపాఠశాలలో విద్యార్థుల పోషణ, హాజరు పెంపు, చదువులో ప్రగతి సాధించాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి అల్పాహారం పథకం 2023 అక్టోబరు 6న అట్టహాసంగా మొదలైంది. అక్టోబరు 26 నుంచి మండలానికి ఒక పాఠశాలలో అమలుచేస్తున్నారు. దశల వారీగా అన్ని ప్రభుత్వ విద్యాలయాల్లో అమలయ్యేలా ప్రణాళిక రూపొందించారు. అయితే కొన్ని పాఠశాలలకే పథకం పరిమితమవుతోంది. సీఎం అల్పాహారం పథకంతో సత్ఫలితాలు వస్తున్నాయి. పేద, మధ్యతరగతి కుటుంబాల విద్యార్థులే కావటంతో ఇళ్లల్లో అల్పాహారం తినకుండా ఖాళీ కడుపుతో పాఠశాలలకు వచ్చేవారు. తల్లిదండ్రులు ఇచ్చిన కొద్దిపాటి డబ్బులతో బిస్కెట్లు, చాక్లెట్లు, చిప్స్ వంటి జంక్‌ఫుడ్ కొనుక్కొని తినేవారు. అల్పాహార పథకం ఆరంభమైన తర్వాత విద్యార్థులు దుకాణాల వైపు వెళ్లడం తగ్గుముఖం పడుతోంది. పాఠశాలల్లో రోజుకో రకం అల్పాహారం వడ్డిస్తుండటంతో విద్యార్థులు తినేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు. ఖమ్మం జిల్లాలో కేవలం ఖమ్మం నగరంలోని రోటరీనగర్ ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో 450 మందికి మాత్రమే లబ్ధి చేకూరుతోంది. పథకం ఆరంభంలో తొమ్మిది పాఠశాలల్లో 1,762 మందికి అల్పాహారం అందింది. అనంతరం కుదించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 23 పాఠశాలల్లో 1,560 మంది విద్యార్థులకు అందిస్తున్నారు. ఒక్కో విద్యార్థికి రోజువారీగా రూ.10.50 చొప్పున ఖర్చు చేస్తున్నారు. ప్రధానంగా ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు కొనసాగుతుండటంతో పదోతరగతి విద్యార్థులు ఖాళీ కడుపుతో ఇబ్బందులు పడుతున్నారు. చదువులపై ఏకాగ్రత చూపటం లేదని ఉపాధ్యాయులు వాపోతున్నారు. అల్పాహార పథకం ప్రభుత్వ, జడ్పీ పాఠశాలలన్నింటికీ వర్తింపజేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

# అనుమతి లేకుంటే జరిమానా

కరీంనగర్:గతంలో ఇంటి అనుమతి కోసం దరఖాస్తు చేస్తే రోజుల తరబడి అనుమతుల కోసం ఎదురు చూడాల్సి వచ్చేది. తెలంగాణ రాష్ట్ర భవన అనుమతి ఆమోదం, స్వీయ ధ్రువీకరణ విధానం (టీఎస్ బీపాస్) అమల్లోకి వచ్చినప్పటి నుంచి నూతన భవనాలకు అనుమతులు తీసుకునేందుకు ప్రజలు ముందుకొస్తున్నారు. దాంతో జిల్లాలోని నగర, పురపాలికల్లో కొత్తగా ఇంటిని నిర్మించేందుకు ముందుగా పట్టణ ప్రణాళిక ద్వారా పర్మిషన్ తీసుకునేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు. అక్రమ నిర్మాణంతో లేనిపోని చిక్కుల్లో పడటం కంటే అనుమతి తీసుకుంటే ఎలాంటి ఇబ్బంది ఉండదనే అభిప్రాయం వ్యక్తం అవుతుంది. కొత్త పురపాలక చట్టం–2019 ప్రకారం భవన నిర్మాణ అనుమతులకు ప్రత్యేక విధానం రావడంతో పాటు నిర్దిష్ట సమయంలో అనుమతి జారీ అవుతుంది. మొబైల్ యాప్, టీఎస్‌బీపాస్ వెబ్‌సైట్, మీసేవా, ఈసేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవచ్చు. దీనికి కావాల్సిన నక్షలు, ధ్రువీకరణలు పొందుపర్చాల్సి ఉంటుంది. తప్పుడు సమాచారమిచ్చినా, మాస్టర్‌ప్లాన్ జోనింగ్ నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణం జరిగినట్లు గుర్తిస్తే అనుమతి పొందిన 21 రోజుల్లో రద్దు చేసే అధికారం ఉంది. స్వీయ ధ్రువీకరణ ద్వారా అనుమతులు పొందితే 21 రోజుల తర్వాత పనులు ప్రారంభించాలి.స్వీయ ధ్రువీకరణతో టీఎస్ బీపాస్ ద్వారా అనుమతులు పొందిన అన్ని భవనాల వివరాలు వెబ్‌సైట్‌లో ఉంటాయి. అనుమతులకు విరుద్ధంగా నిర్మించినట్లు ఫిర్యాదులు వస్తే నిర్ణీత గడువులోగా కూల్చే అధికారం టాస్క్‌ఫోర్స్ కమిటీకి ఉంటుంది. ప్రస్తుతం అనుమతుల కోసం దరఖాస్తు చేస్తే చాలు క్షేత్రస్థాయిలో పరిశీలించి ఇరవైఒకటి రోజుల్లోపే ఇంటి అనుమతి వస్తోంది. నూతన భవన నిర్మాణాల జోరు పెరిగింది. శివారు ప్రాంతాల్లో కొత్త నిర్మాణాల సంఖ్య విస్తరిస్తోంది. అదే స్థాయిలో ఇంటి అనుమతులు తీసుకోవడానికి ప్రజలు ఆసక్తి చూపుతున్నారు. జిల్లావ్యాప్తంగా ఉన్న కార్పొరేషన్లు,



మున్సిపాలిటీల్లో ఏటా 1,662 కొత్తగా ఇళ్లు నిర్మించుకోగా, కరీంనగర్ నగర పరిధిలో ఏడాదికి 1,249 ఇళ్లను నిర్మించుకున్నారు. వీటితో పాటు అనధికారిక, అక్రమ నిర్మాణాల లెక్కనే లేదు. అనుమతులకు పెద్దమొత్తం ఫీజు చెల్లించాల్సి వస్తుందని, అధికారుల చుట్టూ తిరగాల్సి వస్తుందనే భయంతో పట్టణ ప్రణాళిక ద్వారా ఇంటి అనుమతులు తీసుకోవడానికి యజమానులు ముందుకు రావడం లేదు. అనుమతులు తీసుకోకపోతే భారమనే విషయాన్ని మాత్రం గుర్తించడం లేదు. నిర్మాణం పూర్తయిన తర్వాత కొత్త ఇంటి నంబర్ కోసం దరఖాస్తు చేసే సమయంలో ఈ విషయం బయట పడుతుంది. అనుమతిపత్రం లేకపోతే ఆస్తిపన్ను మదింపులో జరిమానా విధిస్తున్నారనే విషయాన్ని గుర్తించాలి. మొత్తమే అనుమతి లేకపోతే వందశాతం, అనుమతి తీసుకొని ఒకట్రెండు అంతస్థులు, అదనపు నిర్మాణాలుంటే 25 నుంచి 75 శాతం వరకు అదనంగా పన్ను విధిస్తున్నారు. పైగా ఇలాంటి వాటికి జాతీయ బ్యాంకుల్లో రుణం కూడా ఇవ్వరు. ఈ విషయాన్ని ప్రచారం చేయకపోవడంతో అనధికారిక కట్టడాలు కూడా పెరిగిపోతున్నాయి.

# మహిళా సభ్యులకు స్వయం సిద్ధ రుణం

సారంగాపూర్: మహిళా సంఘాల వారీగా గ్రూపు సభ్యులందరికీ కలిపి బ్యాంకు లింకేజీ ద్వారా ఈ ఏడాది ఒక్క జగిత్యాల జిల్లాలో రూ. 635 కోట్లు అందిస్తుండగా.. ఒక్కో సంఘానికి గరిష్ఠంగా రూ.20 లక్షల వరకు రుణాన్ని అందిస్తున్నారు. సంఘంలోని సభ్యులంతా రుణాన్ని సమానంగా తీసుకోవాల్సి ఉంటుంది. దీనివల్ల వ్యక్తిగతంగా రుణం అవసరమున్న వారు ఇబ్బంది పడాల్సి వస్తోంది. దీనిని దృష్టిలో ఉంచుకుని సెర్ప్ అధికారులు మహిళా సంఘాల వారీగా కాకుండా సభ్యురాలికి వ్యక్తిగతంగా రుణం అందించేందుకు నూతనంగా 'స్వయం సిద్ధ' పథకాన్ని తీసుకువచ్చారు. ఇందులో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా వెయ్యి మందిని ఎంపిక చేయగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 117 మందికి రుణం అందించేందుకు లక్ష్యాన్ని నిర్దేశించారు. జగిత్యాల జిల్లాలో 37, కరీంనగర్‌లో 32, పెద్దపల్లిలో 24, రాజన్న సిరిసిల్ల జిల్లాలో 24 మంది మహిళలకు రుణాలు అందించనున్నారు. చిరువ్యాపారాలు ఏర్పాటు చేసుకునేందుకు ఎంపిక చేసిన మహిళలకు రూ.లక్ష నుంచి రూ.5 లక్షల వరకు రుణం అందించనున్నారు. కనీసం రెండేళ్ల నుంచి సంఘంలో సభ్యురాలిగా ఉండి, సంఘ లావాదేవీలలో సరిగా ఉన్న వారికి రుణం వర్తించనుంది. ప్రస్తుతం ఎస్‌బీఐ బ్యాంకు ద్వారా అందిస్తుండగా తీసుకున్న రుణానికి ఎలాంటి రాయితీ వర్తించదు.

తీసుకున్న రుణాన్ని వాయిదా పద్ధతిలో చెల్లించాల్సి ఉంటుంది. మహిళా సభ్యురాలు అనుభవం ఉన్న వ్యాపారాన్ని ఎంచుకోవాలి.

Editor,Printer, Publisher & Owner by **Reddy Shekar**,3-184, venkatapur, (m) venkatapur, mulugu dist, 506352, Printed at 16-48
**SS Printers,** (m) mulugu, mulugu. RNI NO:- TELTEL 02048/2021, **E Mail : teenmaardesk@gmail.com, Cell : 9177108128**